# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 86, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) ఆదివారం -15 - జూన్ - 2025


## గాజాలో అలా జరుగుతుంటే.. మోదీ సర్కారు ఇలా ప్రవర్తిస్తే ఎలా?




గాజాలో పౌరుల రక్షణ- చట్టపరమైన, మానవతా బాధ్యతలకు కట్టుబడి ఉండాలి గాజా వివాదంలో ఇరు పక్షాలను దగ్గరకు తీసుకురావడంపై ప్రయత్నాలు దృష్టి పెట్టాలి

## ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు

అమాంతం పెరిగిన ముడి చమురు ధరలు, భారత్‌పై ప్రభావమెంత?




- ఇరాన్ అణుకేంద్రాలపై ఇజ్రాయెల్ మెరుపుదాడులతో చమురు మార్కెట్లలో ప్రకంపనలు
- ఐదు నెలల గరిష్ఠానికి చేరిన ముడిచమురు ధర.. బ్యారెల్ 78 దాలర్లు

## ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం లతో భేటీ కానున్న టాలీవుడ్ ప్రముఖులు !


2లో




నేడు (జూన్ 15, ఆదివారం) సాయంత్రం 4 గంటలకు భేటీ ఈ సమావేశానికి సినీ పరిశ్రమకు చెందిన 35 నుంచి 40 మంది ప్రముఖులు హాజరయ్యే అవకాశం




## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు.. రేవంత్ రెడ్డి, కేంద్రంపై

### హరీశ్ రావు తీవ్ర విమర్శలు

- బనకచర్ల మరో పోతిరెడ్డిపాడు అవుతుందని హరీశ్ రావు ఆందోళన
- బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ముందుకెళుతుంటే తెలంగాణ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుందని విమర్శ
- రాష్ట్ర ప్రయోజనాల కంటే కేసులపైనే ప్రభుత్వానికి ధ్యాస అని ఆరోపణ
- నిధులు, నదుల విషయంలో తెలంగాణకు కేంద్రం అన్యాయం

# గద్దర్ ఫౌండేషన్‌కు

## తెలంగాణ ప్రభుత్వం చేయూత..

## రూ.3 కోట్లు మంజూరు

సీఎం రేవంత్ రెడ్డి నిధుల కేటాయింపునకు ఆమోదం

- గద్దర్ ఆశయాలు, సాంస్కృతిక సేవపై పరిశోధనలకు మద్దతు
- గద్దర్ జయంతి, స్మారక ప్రాజెక్టులకు ఈ నిధుల వినియోగం
- ప్రజా గాయకుడి రచనలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యం




హైదరాబాద్: ప్రముఖ విప్లవ కవి, వాగ్గేయకారుడు, దివంగత గద్దర్ సేవలను గౌరవిస్తూ ఆయన ఆశయాలను సజీవంగా ఉంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గద్దర్ ఫౌండేషన్‌కు మూడు కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధుల కేటాయింపునకు ఇటీవలే ఆమోదముద్ర వేశారు. గద్దర్ భావజాలాన్ని పరిరక్షించడం, మిగతా..2లో

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు... కేంద్రానికి తెలంగాణ మంత్రి లేఖ




### గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం

- కేంద్ర జలశక్తి శాఖకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ
- ప్రాజెక్టు జీడబ్ల్యూడీటీ, పునర్విభజన చట్టానికి విరుద్ధమని స్పష్టీకరణ
- ఏపీ పీఎఫ్ఆర్‌ను తిరస్కరించాలని, డీపీఆర్ సమర్పణను ఆపాలని వినతి

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశం మరోమారు వివాదాస్పదమైంది. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిగతా..2లో




## కొత్త మంత్రులకు

### చాంబర్లు కేటాయింపు ఇలా..

- సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) చాంబర్ల కేటాయింపుపై ఉత్తర్వులు జారీ
- సచివాలయ మొదటి అంతస్తులో 13, 14, 15, 16 నంబర్ గదులు

## విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు సమర్థుడు కాదు..

మోదీకి లేఖ రాసిన కేఏ పాల్




## కేసీఆర్‌కు రెండో రోజూ ఏఐజీలో వైద్య పరీక్షలు

- మరోసారి ఏఐజీ ఆసుపత్రికి మాజీ సీఎం కేసీఆర్
- శుక్రవారం కూడా గంటపాటు ఆసుపత్రిలోనే కేసీఆర్

హైదరాబాద్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శనివారం వైద్య పరీక్షల నిమిత్తం గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రికి వెళ్లారు. సాధారణ ఆరోగ్య తనిఖీలలో మిగతా..2లో




## ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారి విదేశీ పర్యటనకు వెళుతున్న ప్రధాని మోదీ

- ప్రధాని నరేంద్ర మోదీ జూన్ 15 నుంచి 19 వరకు విదేశీ పర్యటన
- తొలుత సైప్రస్, తర్వాత కెనడా, చివరగా క్రొయేషియాలను సందర్శన
- కెనడాలోని కాననాస్కిస్‌లో జీ-7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని
- ఇంధన భద్రత, ఏఐ, క్వాంటం అంశాలపై కీలక చర్చల్లో భాగస్వామ్యం
- రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌కు, తొలిసారిగా క్రొయేషియాకు భారత ప్రధాని
- యూరోపియన్ యూనియన్‌తో బంధాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి




ఢిల్లీ: దేశంలో ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం తెలిసిందే. ఈ కీలక పరిణామం అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన తొలి విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు ఆయన సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల్లో మిగతా..2లో




## నా తండ్రి ఇలాగే మరణించారు.. వారి బాధను అర్థం చేసుకోగలను

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై రామ్మోహన్ నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష

దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడి

హోంశాఖ సెక్రటరీ నేతృత్వంలో మరో ప్రత్యేక బృందం

అమరావతి: "నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ప్రభావ కుటుంబాల బాధ నాకు తెలుసు.. నేను అర్థం చేసుకోగలను" అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన మిగతా..2లో

## రైతులను రౌడీలుగా చూపిస్తూ..

# చంద్రబాబుపై వైఎస్ జగన్ ఫైర్

★రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే రాళ్ల దాడా..?

★కనీస మద్దతు ధరలు లభించక రైతులు అన్యాయానికి గురవుతున్నారు

హైదరాబాద్: రాష్ట్రంలో అన్యాయానికి గురవుతున్న రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే రాళ్ల దాడి చేయించారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జగన్ ట్వీట్ చేశారు. పొగాకు పంటకు కనీస మద్దతు ధరలు లభించక రైతులు అన్యాయానికి గురవుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాలోని పొదిలిలో రైతులను పరామర్శించి భరోసా చెప్పేందుకే తాను అక్కడికి వెళ్లానని జగన్ తెలిపారు. తన పర్యటనకు సంఘీభావంగా దాదాపు 40 వేల మంది రైతులు, ప్రజలు తరలి వచ్చారని జగన్ తెలిపారు. అయితే, తాము వెళ్తున్న మార్గంలో 40 మంది టీడీపీ కార్యకర్తలను పెట్టి, వారితో రాళ్లు విసిరి గలాటా చేయించారని ఆరోపించారు. ఈ రాళ్ల దాడి వెనకున్న పన్నాగాన్ని అర్థం చేసుకున్న ప్రజలు, రైతులు అత్యంత సంయమనంతో వ్యవహరించారని చెప్పారు. రాళ్ల దెబ్బలు తిన్న వైసీపీ కార్యకర్తలు, రైతులపైనే పోలీసు కేసులు బనాయించడాన్ని తీవ్రంగా




ఖండిస్తున్నట్లు తెలిపారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా, తిరిగి వారిపైనే ఎదురు కేసులు పెట్టడం మీకు మాత్రమే చెల్లుతుంది అంటూ జగన్ ట్వీట్ చేశారు. ఆ నలభై మంది టీడీపీ కార్యకర్తలపై అక్కడున్న 40 వేల మంది ప్రజలు తిరగబడి ఉంటే ఏం జరిగి ఉండేదని జగన్ ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలి, అన్యాయాన్ని సరిదిద్దాలని కోరితే తానేదో విషయాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నానని ఆరోపించడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.

## కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం

# దురదృష్టకరం: పవన్ కల్యాణ్

కూర్మలో ఆధ్యాత్మిక కేంద్రానికి నిప్పు, భారీ ఆస్తి నష్టం దుండగుల పనేనని నిర్వాహకుల ఆరోపణ, దర్యాప్తు ముమ్మరం ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి లోతైన విచారణ జరపాలని పోలీసులకు ఆదేశం



అమరావతి: శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండల పరిధిలోని కూర్మ గ్రామంలో ప్రశాంతతకు భంగం వాటిల్లింది. ఆధ్యాత్మిక చింతనతో, ప్రకృతి ఒడిలో జీవనం సాగించే ఈ గ్రామంలోని ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం కొన్నిరోజుల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందా మిగతా..2లో

# ఏపీ సీఎం, డిప్యూటీ సీఎం లతో భేటీ కానున్న టాలీవుడ్ ప్రముఖులు !

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు నేడు (జూన్ 15, ఆదివారం) సాయంత్రం 4 గంటలకు భేటీ కానున్నారు. ఈ సమావేశానికి సినీ పరిశ్రమకు చెందిన 35 నుంచి 40 మంది ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. సమావేశానికి ముందు వారు మొదట రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని కలవనున్నారు. అనంతరం ఆయనతో కలిసి సీఎం చంద్రబాబు నివాసానికి వెళ్లి చర్చల్లో పాల్గొననున్నారు. ఈ భేటీలో ఏపీ చిత్ర పరిశ్రమకు సంబంధించిన పలు కీలక అంశాలు చర్చకు రానున్నట్టు తెలిస్తోంది. గత కొంతకాలంగా సినీ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య పర్సంటేజీ వ్యవహారంపై చర్చలు నడుస్తున్నాయి. అద్దెల రూపంలో మూవీలను ప్రదర్శించడం సాధ్యం కావడం లేదని ఎగ్జిబిటర్లు అంటుంటే.. పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే సినిమా థియేటర్ల బంద్ కు పిలుపునివ్వడం.. ఆ తర్వాత బంద్ నిర్ణయాన్ని వాయిదా వేయడం జరిగాయి. థియేటర్ల బంద్ అంశంపై పవన్ కళ్యాణ్ ఇప్పటికే తీవ్రంగా స్పందించారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారైనా సీఎం చంద్రబాబుని కలిశారా?" అని సినీ ప్రముఖులను ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే పవన్ సినిమాకి కావాలనే అడ్డంకులు సృష్టించడం కోసం ఆ నలుగురు అలా ప్లాన్ చేశారని కూడా టాలీవుడ్ లో గుసగుసలు వినిపించాయి. పలువురు నిర్మాతలు సైతం ఆ నలుగురం మేము కాదంటూ ఓపెన్ గానే స్టేట్ మెంట్స్ ఇచ్చారు. తర్వాత ముఖ్యంగా థియేటర్ల పరిస్థితి, మౌలిక సదుపాయాలపై ఇటీవల సినిమాటోగ్రఫీ శాఖ ఆదేశాల మేరకు అధికారులు పలు థియేటర్లలో తనిఖీలు చేపట్టారు. ఈ పరిస్థితుల్లోనే ఏపీలో చిత్ర పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య సహకారం పెంపొందించేందుకు ఈ సమావేశం కీలకం కానుంది. సీఎం సూచన మేరకు మంత్రి కందుల దుర్గేష్ సినీ ప్రముఖులకు ఆహ్వానం పంపారు. సమావేశం అనంతరం ఆయన ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఇక ఈ సమావేశానికి హాజరయ్యే వారిలో దర్శకులు బోయపాటి శ్రీనివాస్, త్రివిక్రమ్ శ్రీనివాస్, ఎస్.ఎస్. రాజమౌళి, నాగ అశ్విన్‌లు ఉంటారని సమాచారం. అలానే నిర్మాతల్లో అశ్వినీదత్, దిల్‌రాజు, అల్లు అరవింద్, డివివి దానయ్య, కేవీ రామారావు హాజరు కానున్నారు. నటుల్లో నందమూరి బాలకృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్, మంచు మనోజ్, ఆర్.నారాయణమూర్తి, సీనియర్ నటుడు సుమన్, నేచురల్ స్టార్ నాని ఉంటారని భావిస్తున్నారు. అలానే ఇంకా పలువురు ప్రముఖులు సమావేశంలో పాల్గొననున్నట్టు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీరిలో పలువురు సినిమా థియేటర్ వ్యాపారంలోనూ ఉన్న కారణంగా, థియేటర్ సమస్యలపై చర్చలు మరింత బలంగా జరిగే అవకాశం ఉందని అంటున్నారు.

# కేసీఆర్‌కు రెండో రోజూ ఏఐజీలో వైద్య పరీక్షలు



(ఏఐజీ) ఆసుపత్రికి వెళ్లారు. సాధారణ ఆరోగ్య తనిఖీలలో సాధారణ ఆరోగ్య తనిఖీలలో భాగంగా ఆయన వరుసగా రెండో రోజు ఆసుపత్రికి వెళ్లడం గమనార్హం. కేసీఆర్ నిన్న మధ్యాహ్నం కూడా ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఏఐజీ ఆసుపత్రికి వెళ్ళిన విషయం తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2:30 గంటలకు ఆసుపత్రికి వచ్చిన కేసీఆర్, దాదాపు గంటసేపు అక్కడే ఉన్నారు. ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్, ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసీఆర్‌కు ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు లేవని వైద్యులు తెలిపారు. అయితే, ఆయన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారని సమాచారం.

## గద్దర్ ఫౌండేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం చేయూత.. రూ.3 కోట్లు మంజూరు

### సీఎం రేవంత్ రెడ్డి నిధుల కేటాయింపునకు ఆమోదం

హైదరాబాద్: ప్రముఖ విప్లవ కవి, వాగ్గేయకారుడు, దివంగత గద్దర్ సేవలను గౌరవిస్తూ ఆయన ఆశయాలను సజీవంగా ఉంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గద్దర్ ఫౌండేషన్‌కు మూడు కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధుల కేటాయింపునకు ఇటీవలే ఆమోదముద్ర వేశారు. గద్దర్ భావజాలాన్ని పరిరక్షించడం, ఆయన ఆలోచనలు, సాంస్కృతిక ప్రభావంపై పరిశోధనలను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ నిధులను గద్దర్ ఫౌండేషన్ చేపట్టే వివిధ కార్యక్రమాలకు వినియోగించనున్నారు. ముఖ్యంగా గద్దర్ స్ఫూర్తిని కొనసాగించే పరిశోధన కార్యక్రమాలు, ఆయన స్మారకార్థం చేపట్టే ప్రాజెక్టులు, గద్దర్ జయంతి వంటి కార్యక్రమాల నిర్వహణకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడనుంది. గద్దర్ రచించిన పాటలు, ఆయన చేసిన పోరాటాలు, అందించిన సృజనాత్మక సందేశాన్ని భవిష్యత్ తరాలకు చేరవేయాలనేది ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ, అణగారిన వర్గాల హక్కుల కోసం గద్దర్ చేసిన నిరంతర పోరాటానికి గుర్తింపుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గద్దర్ తన జీవితాంతం కుల వివక్ష, సామాజిక అన్యాయాలపై తన గళాన్ని బలంగా వినిపించారు. తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక విభాగంలో ఆయన పోషించిన పాత్ర అత్యంత కీలకమైనది. తన పాటలు, ప్రసంగాల ద్వారా సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం రగిలించడంలో గద్దర్ ముందున్నారు. 2023 ఆగస్టులో ఆయన మరణం ఒక శకానికి ముగింపు పలికినప్పటికీ, గద్దర్ ఫౌండేషన్ ద్వారా ఆయన ప్రభావం కొనసాగుతోంది. ఇప్పటికే హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గద్దర్ స్మారక చిహ్నం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. గద్దర్ ఫౌండేషన్‌కు ఈ మూడు కోట్ల రూపాయల కేటాయింపు ద్వారా ఆయన ప్రబోధించిన సమానత్వం, న్యాయం, సాంస్కృతిక వైభవం వంటి విలువలను పరిరక్షించి, రాబోయే తరాలకు అందించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయంగా కనిపిస్తోంది.

## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు... కేంద్రానికి తెలంగాణ మంత్రి లేఖ

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశం మరోమారు వివాదాస్పదమైంది. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని, దీనిని తక్షణమే అడ్డుకోవాలని ఆయన ఆ లేఖలో కోరారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి శాఖకు రాసిన లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన ఈ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు, గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) అవార్డుతో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక సాధ్యాసాధ్యతల నివేదిక (పీఎఫ్ఆర్)కు కేంద్రం ఇంకా ఆమోదం తెలపకముందే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీపీఆర్ ఎలా అడుగుతుందని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ పీఎఫ్ఆర్‌ను తిరస్కరించాలని, డీపీఆర్ సమర్పించకుండా ఆంధ్రప్రదేశ్‌ను నిలువరించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి టెండర్లు పిలవకుండా ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా మంత్రి ఉత్తమ్ తన లేఖలో కేంద్రాన్ని కోరారు.

## నా తండ్రి ఇలాగే మరణించారు.. వారి బాధను అర్థం చేసుకోగలను

అమరావతి: "నా తండ్రి కూడా ప్రమాదంలోనే మరణించారు. అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద ప్రభావ కుటుంబాల బాధ నాకు తెలుసు.. నేను అర్థం చేసుకోగలను" అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనను పౌర విమానయాన శాఖ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనపై శనివారం ఆయన ఢిల్లీలో ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టామని, గుజరాత్ ప్రభుత్వం, పౌర విమానయాన శాఖ సమన్వయంతో పనిచేశాయని తెలిపారు. "ఘటన జరిగిన వెంటనే మంటలను అదుపులోకి తెచ్చి, మృతదేహాలను తరలించాం. ఈ దుర్ఘటనపై తక్షణమే దర్యాప్తునకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశాం. అవసరమైతే ఈ కమిటీలో మరికొంత మంది సభ్యులను కూడా చేర్చుతాం" అని వివరించారు. శుక్రవారం సాయంత్రం ఘటనా స్థలంలో విమాన బ్లాక్‌బాక్స్ లభ్యమైందని, దానిని విశ్లేషించిన తర్వాత ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. "బ్లాక్ బాక్స్‌లో ఏముందో తెలుసుకోవడానికి ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు. దర్యాప్తు ప్రక్రియ గురించి వివరిస్తూ, "హోంశాఖ సెక్రెటరీ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశాం. ఇందులో వివిధ రంగాలకు చెందిన నిపుణులు, ప్రత్యేక అధికారులు సభ్యులుగా ఉంటారు. సంపూర్ణ దర్యాప్తు జరిపేందుకు ఈ కమిటీ దోహదపడుతుంది. నిపుణుల విచారణ పూర్తయిన తర్వాత, తగిన సమయంలో మీడియాకు అన్ని వివరాలు వెల్లడిస్తాం. రెండు నెలల్లోగా విచారణ పూర్తవుతుందని ఆశిస్తున్నాం. అంతేకాకుండా, బోయింగ్ 787 సిరీస్ విమానాలను తరచూ తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం" అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు సమర్థుడు కాదు..

హైదరాబాద్: అహ్మదాబాద్ లో సంభవించిన ఘోర విమాన ప్రమాదం నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంతో క్లిష్టమైన పౌర విమానయాన శాఖను నిర్వహించేందుకు రామ్మోహన్ నాయుడు సమర్థుడు కాదని, ఆయనకు తగినంత అనుభవం లేదని పాల్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ఒక సూచన చేశారు. పౌర విమానయాన శాఖ ఎంతో క్లిష్టమైనదని, దానిని నిర్వహించడానికి అపారమైన నైపుణ్యం, పరిణతి, అనుభవం అవసరమని కేఏ పాల్ అన్నారు. 37 ఏళ్ల రామ్మోహన్ నాయుడు ఉత్సాహవంతుడు, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తి అయినప్పటికీ, ఈ కీలక శాఖను నడిపించడానికి అవసరమైన సామర్థ్యం ఆయనకు ఇంకా రాలేదని పాల్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంతటి సున్నితమైన, సాంకేతికంగా అత్యంత కీలకమైన శాఖ బాధ్యతల నుంచి రామ్మోహన్ నాయుడిని తప్పించాలని ఆయన ప్రధానమంత్రికి సూచించారు. విమానయాన రంగం అనేక సవాళ్లతో కూడుకున్నదని, దానికి తగిన అనుభవజ్ఞులను మంత్రిగా నియమించాల్సిన అవసరం ఉందని పాల్ పరోక్షంగా తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్ అనంతరం తొలిసారి విదేశీ పర్యటనకు వెళుతున్న ప్రధాని మోదీ



జూన్ 15 నుంచి 19వ తేదీ వరకు ఆయన సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల్లో పర్యటించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఇచ్చిన నూతనోత్సాహంతో ప్రధాని చేపడుతున్న ఈ యాత్ర, అంతర్జాతీయంగా భారత్ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటన వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శనివారం అధికారికంగా ప్రకటించింది.

సైప్రస్ పర్యటన

పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ తొలుత జూన్ 15, 16 తేదీలలో సైప్రస్‌లో ఉంటారు. ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ పర్యటన ఖరారైంది. విశేషమేమిటంటే, రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. నికోసియాలో అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి చర్చలు జరుపుతారు. అనంతరం లిమాసోల్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నారు. ఈ భేటీలు మధ్యధరా ప్రాంతం మరియు యూరోపియన్ యూనియన్‌తో భారతదేశపు వ్యూహాత్మక బంధాలను కొత్త శిఖరాలకు చేర్చుతాయని ఆశిస్తున్నారు.

కెనడాలో జీ-7 సదస్సు

ఆ తర్వాత, జూన్ 16, 17 తేదీల్లో కెనడాలోని కాననాస్కిస్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక జీ-7 శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొంటారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు ఆయన ఈ సదస్సుకు హాజరవుతున్నారు. ప్రధాని మోదీ జీ-7 సదస్సులో పాలుపంచుకోవడం ఇది వరుసగా ఆరోసారి కావడం గమనార్హం. ఈ వేదికపై ఇంధన భద్రత, ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ)-ఇంధన రంగాల అనుసంధానం, క్వాంటం టెక్నాలజీ వంటి కీలక అంశాలపై ప్రధాని తన అభిప్రాయాలను పంచుకుంటారు. పలు దేశాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించనున్నారు.

### చారిత్రక క్రొయేషియా పర్యటన

ఈ విదేశీ పర్యటన చివరి అంకంలో, జూన్ 18న ప్రధాని మోదీ క్రొయేషియాను సందర్శిస్తారు. క్రొయేషియా ప్రధాని ఆండ్రెజ్ ప్లెన్కోవిక్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరగనుంది. ఒక భారత ప్రధాని క్రొయేషియాలో పర్యటించడం ఇదే ప్రప్రథమం కావడంతో దీనికి చారిత్రక ప్రాధాన్యత ఏర్పడింది. భారత్-క్రొయేషియా సంబంధాలలో ఇదొక సువర్ణాధ్యాయమని విదేశీ వ్యవహారాల శాఖ అభివర్ణించింది. ఈ పర్యటన ద్వారా యూరోపియన్ యూనియన్‌లోని ముఖ్య దేశాలతో భారత్ సంబంధాలు మరింత పటిష్టం అవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు.. రేవంత్ రెడ్డి, కేంద్రంపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు




హైదరాబాద్: కృష్ణా నదీ జలాలను అక్రమంగా తరలించుకుపోవడానికి పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఏ విధంగా ఉపయోగపడిందో, అదే విధంగా గోదావరి జలాలను తరలించుకోవడానికి బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు కీలక విషయాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుంటే, తెలంగాణ ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణ పనులను చురుగ్గా చేపడుతుంటే, మన ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది" అని హరీశ్ రావు విమర్శించారు. ఈ నెలాఖరు నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంకా నిద్రలోనే ఉందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేవలం ఉత్తుత్తి మాటలతో కాలం గడుపుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి కూడా ముందుకు రావడం లేదని, కేటీఆర్‌పై ఎలా కేసులు పెట్టాలనే దానిపై ఉన్న శ్రద్ధ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో లేదని ఆయన అన్నారు.

కేంద్రం తీరుపై విమర్శలు

కేంద్ర ప్రభుత్వ వైఖరిని కూడా హరీశ్ రావు తప్పుపట్టారు. "గత రెండు కేంద్ర బడ్జెట్లను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వరద పారుతుంటే, తెలంగాణకు మాత్రం గుండు సున్నా దక్కింది. నిధులు ఆంధ్రాకే, నదులు ఆంధ్రాకే అన్నట్లుగా ఢిల్లీ పాలకుల తీరు ఉంది" అని ఆయన అన్నారు. నిధుల కేటాయింపుల్లో, నదీ జలాల పంపకాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు నోరు మెదపడం లేదని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు కూడా స్పందించడం లేదని విమర్శించారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు ఇచ్చి మరీ సహకరిస్తోందని, తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2 టీఎంసీల బాబ్లీ నీటి కోసం 2008లో చంద్రబాబు పోరాటం చేశారని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఏకంగా 200 టీఎంసీల నీటితో ఏపీ అక్రమ ప్రాజెక్టు కడుతుంటే తెలంగాణ ప్రభుత్వం ఎంతటి పోరాటం చేయాలో ఆలోచించాలని హరీశ్ రావు అన్నారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్ర భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు. "ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఇంకా ఎక్కువ నష్టం జరగక ముందే గోదావరి-బనకచర్లను అడ్డుకోండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసే ఏ పోరాటానికైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుంది. మీరు ముందుకు రాకపోతే, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీనే పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంది" అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు

### అమాంతం పెరిగిన ముడి చమురు ధరలు, భారత్‌పై ప్రభావమెంత?

ఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లను కుదిపేశాయి. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేయడంతో ముడి చమురు ధరలు అమాంతం పెరిగాయి. కీలకమైన పశ్చిమాసియా ప్రాంతం నుంచి చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న ఆందోళనలతో, బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర శనివారం బ్యారెల్‌కు 6 డాలర్లకు పైగా పెరిగి, ఐదు నెలల గరిష్ఠ స్థాయి 78 డాలర్లకు చేరింది. ఇరాన్ కూడా టెల్ అవీవ్‌పై దాడులకు దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ పరిణామాల వల్ల ఇంధన వ్యయాలు పెరిగి, రవాణా ఖర్చులు కూడా అధికమవుతాయి. ప్రపంచ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న భయాలతో అమెరికా స్టాక్ మార్కెట్లు కూడా పతనమయ్యాయి. ఎస్-పీ గ్లోబల్ కమోడిటీ ఇన్‌సైట్స్ విశ్లేషకుల ప్రకారం, ఈ దాడులు సమీప భవిష్యత్తులో చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దోహదపడినప్పటికీ, చమురు ఎగుమతులపై ప్రత్యక్ష ప్రభావం పడితే తప్ప ఈ ధరల ఒత్తిడి నిలకడగా ఉండకపోవచ్చు. "గతంలో ఇరాన్, ఇజ్రాయెల్ పరస్పరం దాడులు చేసుకున్నప్పుడు కూడా ధరలు పెరిగాయి, కానీ పరిస్థితి అదుపులోకి వచ్చి, చమురు సరఫరాపై ప్రభావం లేదని తేలగానే తగ్గాయి" అని ఎస్-పీ గ్లోబల్ కమోడిటీ ఇన్‌సైట్స్ స్వల్పకాలిక చమురు విశ్లేషణ విభాగం హెడ్ రిచర్డ్ జోస్విక్ ఏఎన్ఐ వార్తా సంస్థకు తెలిపారు. భారత్ నేరుగా ఇరాన్ నుంచి పెద్ద మొత్తంలో చమురును దిగుమతి చేసుకోకపోయినప్పటికీ, తన అవసరాల్లో దాదాపు 80 శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. ఇరాన్, అరేబియా ద్వీపకల్పం మధ్య ఉన్న స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్, ప్రపంచ ఎల్ఎన్‌జి వాణిజ్యంలో దాదాపు 20 శాతం, గణనీయమైన ముడి చమురు ఎగుమతులకు కీలక మార్గం. ఈ మార్గంలో ఏదైనా అంతరాయం ఏర్పడితే, భారత్‌కు ప్రధాన సరఫరాదారులైన ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈల నుంచి చమురు రవాణాకు ఆటంకం కలగవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది భారత ఎగుమతులపై కూడా సమయం, వ్యయాల పరంగా ప్రభావం చూపుతుందని వారు హెచ్చరిస్తున్నారు. గతంలో ఈ కీలక మార్గాన్ని అడ్డుకుంటామని ఇరాన్ హెచ్చరించిన సందర్భాలున్నాయి. అయితే, ఒపెక్ ప్లస్ దేశాలు జూలైలో ఊహించిన దానికంటే అధిక ఉత్పత్తి పెంపును ప్రకటించడంతో, ప్రాథమికంగా చమురు మార్కెట్లు బాగానే సరఫరా అవుతున్నాయని, ఇరాన్ సరఫరా కోతలను కూడా సర్దుబాటు చేయవచ్చని ఎంకే గ్లోబల్ అనే ఆర్థిక సేవల సంస్థ నివేదిక పేర్కొంది. ప్రస్తుతానికి, మార్కెట్లు అప్రమత్తంగా ఉన్నాయి.

## ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానాలకు డీజీసీఏ ఆదేశాలతో భద్రతా తనిఖీలు

ఢిల్లీ: పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) జారీ చేసిన ఆదేశాల మేరకు తమ సంస్థకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాలకు ప్రత్యేక భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎయిరిండియా శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు చేపట్టినట్లు సంస్థ పేర్కొంది. తమ ఫ్లీట్‌లోని బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో ఇప్పటికే తొమ్మిదింటికి భద్రతా తనిఖీలు పూర్తయ్యాయని వెల్లడించింది. మిగిలిన 24 డ్రీమ్‌లైనర్ విమానాలకు కూడా నిర్దేశిత గడువులోగా ఈ తనిఖీలను పూర్తి చేస్తామని సంస్థ స్పష్టం చేసింది. "డీజీసీఏ ఆదేశాలకు అనుగుణంగా వన్ టైమ్ భద్రతా తనిఖీలను కొనసాగిస్తున్నాం. బోయింగ్ 787 విమానాలు భారతదేశానికి తిరిగి వచ్చిన వెంటనే ఈ తనిఖీలు చేపడుతున్నాం" అని ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. ప్రస్తుతం టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా వద్ద 26 బోయింగ్ 787-8 విమానాలు, 7 బోయింగ్ 787-9 విమానాలు సేవలు అందిస్తున్నాయి. ఈ విమానాలకు సంబంధించి వివిధ వ్యవస్థల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించాలని, ముఖ్యంగా విమానం టేకాఫ్ అంశానికి సంబంధించిన సాంకేతిక పరామితులను తనిఖీ చేయాలని డీజీసీఏ తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది.

ప్రయాణికులపై ప్రభావం, సూచనలు

కొన్ని విమానాలకు సంబంధించిన తనిఖీ ప్రక్రియకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని, దీనివల్ల ముఖ్యంగా సుదూర ప్రయాణ మార్గాల్లో నడిచే విమాన సర్వీసుల్లో కొంత ఆలస్యం జరగవచ్చని ఎయిరిండియా తెలిపింది. ఈ నేపథ్యంలో, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. "ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందు తమ విమాన సర్వీసు స్టేటస్‌ను ఒకసారి తనిఖీ చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని ఎయిరిండియా తమ ప్రకటనలో కోరింది.

## గాజాలో అలా జరుగుతుంటే.. మోదీ సర్కారు ఇలా ప్రవర్తిస్తే ఎలా?

ఢిల్లీ: గాజాలో పౌరుల రక్షణ- చట్టపరమైన, మానవతా బాధ్యతలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చే ఐక్యరాజ్యసమితి తీర్మానానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం దూరంగా ఉండటంపై వయనాడ్ నుండి కాంగ్రెస్ ఎంపీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా శనివారం తీవ్రంగా విమర్శించారు. గాజా వివాదంలో ఇరు పక్షాలను దగ్గరకు తీసుకురావడంపై ప్రయత్నాలు దృష్టి పెట్టాలని ఇజ్రాయెల్‌ను విమర్శిస్తూ జనరల్ అసెంబ్లీ తీర్మానానికి భారతదేశం మళ్ళీ దూరంగా ఉంది. గురువారం జరిగిన తీర్మానానికి దూరంగా ఉన్న 19 దేశాలలో భారతదేశం ఒకటి. 149 ఓట్లు, అమెరికాతో సహా 12 వ్యతిరేకంగా ఓటు వేశాయి. ఈ చర్యను "సిగ్గుచేటు మరియు నిరాశపరిచేది" అని ప్రియాంక ఎక్స్‌లో పోస్ట్ చేశారు 60వేల మంది, ఎక్కువగా మహిళలు, పిల్లలు, ఇప్పటికే చంపబడ్డారు. మొత్తం జనాభా పరిమితం చేయబడి ఆకలితో చనిపోతున్నారు, ఈ నేపథ్యంలో భారతదేశం గైర్హాజరు కావడాన్ని ఆమె విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం దేశం దీర్ఘకాల నైతిక దిక్సూచిని విడిచిపెట్టిందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. ఒక దేశాన్ని మొత్తంగా నాశనం చేస్తుంటే మనం మౌనంగా నిలబడటమే కాకుండా, ఇరాన్‌పై దాడి చేసి, దాని సార్వభౌమత్వాన్ని, అన్ని అంతర్జాతీయ నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ సైలెంట్‌గా వుండటం ఏంటని ప్రశ్నించారు. న్యాయం, అహింస మరియు రాజ్యాంగ సూత్రాల విలువలపై స్థాపించబడిన భారతదేశం, అటువంటి క్షణంలో ఎలా ఉదాసీనంగా ఉండగలదని ప్రియాంక ప్రశ్నించారు.


## కొత్త మంత్రులకు చాంబర్లు కేటాయింపు ఇలా..

హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రులకు సచివాలయంలో తమ తనఖా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) చాంబర్ల కేటాయింపుపై ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల మంత్రివర్గంలోకి తీసుకున్న అడ్లూరి లక్ష్మణ్‌కు సచివాలయ మొదటి అంతస్తులో 13, 14, 15, 16 నంబర్ గదులు కేటాయించగా, మంత్రి వివేక్ వెంకటస్వామికి రెండో అంతస్తులో 20, 21, 22 నంబర్ గదులు లభించాయి. వాకిటి శ్రీహరికి రెండో అంతస్తులోనే 26, 27, 28 నంబర్ గదులు కేటాయించారు. ఇప్పుడు చాంబర్ల కేటాయింపుతో వీరు త్వరలోనే తమ శాఖల అధికారిక బాధ్యతలను స్వీకరించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే వారికి శాఖల కేటాయింపులు కూడా పూర్తయ్యాయి. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత వంటి సామాజిక రంగాలకు సంబంధించిన కీలక శాఖలు అప్పగించగా, వివేక్ వెంకటస్వామికి కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, మైనింగ్, జియాలజీ వంటి పారిశ్రామిక రంగాల శాఖలు లభించాయి. వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, క్రీడలు, యువజన సేవల శాఖలు కేటాయించారు. ఈ నేపథ్యంలో సచివాలయంలో వీరికి కేటాయించిన కొత్త కార్యాలయాలు త్వరలో బిజీగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. కొత్త మంత్రులతో కార్యాలయాల్లో కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంది.

## ప్రపంచ టాప్-20 కుబేరుల జాబితాలో మనవాళ్లు

ఢిల్లీ: ప్రపంచ కుబేరుల జాబితాలో రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ మరోసారి సత్తా చాటారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ జాబితాలో టాప్ 20లో ముఖేష్ అంబానీ, ఆదానీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గౌతమ్ ఆదానీలు స్థానాలు దక్కించుకోగా, టాప్ 100లో తొమ్మిది మంది భారతీయ వ్యాపార దిగ్గజాలు చోటు దక్కించుకున్నారు. ప్రతి ఏటా బ్లూమ్‌బర్గ్ ప్రపంచ కుబేరుల జాబితాను విడుదల చేస్తుంది. ఈ క్రమంలో ఈ ఏడాది బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ జాబితాను తాజాగా విడుదల చేసింది. బ్లూమ్‌బర్గ్ ఇండెక్స్ 500 అత్యంత ధనవంతుల జాబితాలో భారతదేశం నుంచి ముఖేష్ అంబానీ (17వ స్థానం), గౌతమ్ ఆదానీ (20), శివనాడార్ (41), షాపూర్ మిస్త్రీ (52), సావిత్రి జిందాల్ (59), అజీమ్ ప్రేమ్ జీ (69), సునీల్ మిట్టల్ (73), దిలీప్ సంఘ్వీ (79), లక్ష్మీ మిట్టల్ (86వ స్థానం)లు వంద స్థానాల్లోపు ఉన్నారు.

## కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం: పవన్ కల్యాణ్



అమరావతి: శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండల పరిధిలోని కూర్మ గ్రామంలో ప్రశాంతతకు భంగం వాటిల్లింది. ఆధ్యాత్మిక చింతనతో, ప్రకృతి ఒడిలో జీవనం సాగించే ఈ గ్రామంలోని ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం కొన్నిరోజుల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందా లేక ఎవరైనా దుండగులు ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటి దుశ్చర్యలు జరిగాయని మందిర నిర్వాహకుల్లో ఒకరైన ప్రభుదాస్ పోలీసులకు వివరించారు. ఈ ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాదం దురదృష్టకరం అని పేర్కొన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి, నిజానిజాలు నిగ్గు తేల్చాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. "ఆధునిక హంగులు లేకుండా అధ్యాత్మిక చింతనతో జీవించేలా తీర్చిదిద్దుకున్న కూర్మ గ్రామం అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరం. శ్రీకాకుళం జిల్లా హిరమండలం సమీపంలోని కూర్మ గ్రామంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై పోలీసులు లోతుగా విచారణ చేయాలని సంబంధిత యంత్రాంగానికి సూచనలు చేశాను. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో ఆ కోణంలోనూ దర్యాప్తు చేపట్టాలి. కూర్మ గ్రామంలో ప్రస్తుత పరిస్థితిపై జిల్లా అధికారులతో మాట్లాడి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాము. సనాతన ధార్మిక జీవనం కోసం ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ గ్రామం ఏర్పాటైంది. కూర్మ గ్రామవాసులు యాంత్రిక జీవన విధానాలకు భిన్నంగా మట్టి ఇళ్ళల్లో ఉంటూ ప్రకృతి వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నారు. వేద విద్యను అభ్యసించే చిన్నారులు సంస్కృతం, తెలుగు, హిందీ, ఆంగ్లం అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారు. వర్తమాన కాలంలో విశిష్టంగా ఉన్న ఈ గ్రామం పునరుద్ధరణపై దృష్టి సారించాలి" అని పవన్ స్పష్టం చేశారు.

# విద్యుత్ షాక్ కు గురై వ్యక్తి మృతి



పటాన్చెరు వు, నియోజకవర్గం ఇంచార్జ్ - భాస్కర్ (శుభోదయం న్యూస్) : జిన్నారం మండలం కాజిపల్లి గ్రామంలో టిప్పర్ కు శనివారం నాడు ఉదయం 10 11 గంటల సమయంలో మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్ కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన జిన్నారం మండలం కాజిపల్లి గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ కి చెందిన డ్రైవర్ రామ్ సుజన్ 38 సంవత్సరాలు షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో టిప్పర్ లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్టోన్ క్రషర్ యజమాని ఫిర్యాదు మేరకు బొల్లారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అమీన్పూర్ లో ఘనంగా వనమోత్సవం



పటాన్చెరువు, (శుభోదయం న్యూస్): సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని చక్రపురి కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వన మహోత్సవం - మొక్కలు నాటుదాం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని



సంరక్షించాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మున్సిపల్ పరిధిలోని పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి నుండి ప్రైమరీ స్కూల్ కు వచ్చిన విద్యార్థులకు అక్షర అభ్యాసం పలకలు బలపాలు పంపిణీ

యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వరిగుంతం కృష్ణ



పటాన్చెరు నియోజకవర్గం, (శుభోదయం న్యూస్): హత్నూర మండలం నస్తీపూర్ గ్రామంలో అంగన్వాడి నుండి ప్రైమరీ స్కూల్ కు వచ్చిన విద్యార్థులకు ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ లోకానంద్ ఆధ్వర్యంలో



అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హత్నూర మండలం ఎం పి ఓ యూసుఫ్ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వరిగుంతం కృష్ణ హాజరయ్యి వరిగుంతం కృష్ణ స్కూల్ విద్యార్థులకు అక్షరాభ్యాసానికి పలకలు మరియు బలపాలు విద్యార్థులకు బహుకరించారు. కృష్ణ మాట్లాడుతూ గతంలో ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఎన్నో సేవలు అందించాను అని అదేవిధంగా ఇప్పుడు ఎప్పటికీ అందిస్తూనే ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్తీపూర్ గ్రామ పంచాయతీ సెక్రెటరీ యాదయ్య, స్కూల్ హెడ్మాస్టర్ లోకానంద్, ప్రధానోపాధ్యాయులు, వాలంటరీ టీచర్ ప్రవళిక, మహిళా సంఘం ఏపీ ప్రవీణ్ స్వామి, అమ్మ పాదమిక పాఠశాల అధ్యక్షురాలు గొడుగు స్వప్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యోగా చేద్దాం - ఆరోగ్యంగా ఉందాం




బద్వేల్, నియోజకవర్గం రిపోర్టర్ - శివారెడ్డి (శుభోదయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్త యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బద్వేల్ లో ఎస్బివిఆర్ కాలేజ్ గ్రౌండ్ లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించిన ఆర్డిఓ చంద్రమోహన్.ఈ కార్యక్రమానికి మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఫారెస్ట్ అధికారులతో పాటు కాలేజ్ విద్యార్థి విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డిఓ చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రజలందరూ సామాజిక బాధ్యతగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని దానికి యోగ ఒకటే సరైన మార్గమని ఈనెల 21న జరుగు యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కొంతమంది బద్వేల్ స్థానిక క్రీడా యువకులు ఆర్డిఓ గారిని మరియు కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిసి సార్ మాకు బద్వేల్ లో ఒక మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ఉన్న ఆర్డీవో కచ్చితంగా మినీ స్టేడీ ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారు. ఇప్పుడు మీరు వచ్చారు మీరైనా ఒక మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. సానుకూలంగా స్పందించి ఆర్డిఓ తప్పకుండా పై అధికారులతో మాట్లాడి తప్పకుండా కృషి చేస్తానని ఆయన అన్నారు.

# తల్లికి వందనం పథకం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎద్దు రాహుల్, వీరపోగు రవి




బద్వేల్ నియోజకవర్గం రిపోర్టర్ - శివారెడ్డి (శుభోదయం న్యూస్ ): ఎన్నికలలో ఇచ్చిన హామీలో భాగంగా తల్లికి వందనం పథకం పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని శనివారం కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఎస్ఎఫ్ఐ కడప నగరికి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎద్దు రాహుల్, వీరపోగు రవి అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ప్రస్తుతం ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కుటుంబంలో ఒకటి నుంచి 12 వరకు తరగతి చదువుతున్న ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద 15 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అధికారంలోకి వచ్చిన వెంటనే మాట తప్పడం సిగ్గుచేటని అదేవిధంగా 2024-25 సంవత్సరం సంబంధించి తల్లి వందనం పథకం బురుడి కొట్టించి తల్లిదండ్రులు మోసం చేశారని.ప్రస్తుతం 2025 -26 సంవత్సరం సంబంధించి 15 వేల ఇస్తామని తల్లుల అకౌంట్ లోకి 13 వేల రూపాయలు జమ చేసి 2 వేల రూపాయలు స్కూలు కాలేజీల అభివృద్ధి పనుల కోసం మినహాయింపు ఇస్తున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఖాతాలో వేస్తామని ప్రభుత్వం ప్రకటించడం చూస్తుంటే వారే ఇచ్చి వారే లాక్కుంటే ఇవ్వడం దండగని అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ బడులలో చదువుతున్న విద్యార్థుల వద్ద వసూలు చేసే డబ్బును ఆ విద్యా సంస్థల అభివృద్ధి ఉపయోగిస్తుందా అంటే ప్రైవేట్,కార్పొరేట్ బడులను అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వాన్నిగా అని ఎద్దేవా చేశారు. దానితోపాటు అనేక అసంబద్ధ నిబంధనలు పేరుతో విద్యార్థుల సంఖ్యను కుదింపు చేయడానికి ఖండిస్తున్నామని వారు తెలిపారు. కరెంటు 300 యూనిట్లు వినియోగిస్తే అర్హులు కారు అనే నిబంధనలను గతంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు వ్యతిరేకించాలని మరి ఇప్పుడు అతను అధికారంలోకి వచ్చిన వెంటనే అతనే మరలా అదే నిబంధనలను కొనసాగిస్తున్నారు. దానితోపాటు ఫోర్ వీలర్ వెహికల్ నిబంధనలను తీసివేయాలని వారు డిమాండ్ చేశారు. ఒక కుటుంబంలో పాఠశాల డిగ్రీ చదివే విద్యార్థులు ఉంటే ఒకరికి మాత్రమే ఏదైనా పథకం వర్తిస్తుందని ఇంట్లో ఎంత మంది ఉంటే ఎంతమందికి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు ఫీజు రియంబర్స్మెంట్ కి లింకు పెట్టడం సరికాదని అన్నారు. ఏదైతే ఎన్నికల సమయంలో ఇచ్చినటువంటి హామీకి అనుగుణంగా 15 వేల రూపాయలు చొప్పున ఇవ్వాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, రోని,మోహన్, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు ఖాసిం పీర్, శ్రీకాంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలి : జేఏసీ అధ్యక్షులు సూరి




గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 15 (శుభోదయం న్యూస్): ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగులు శుక్రవారం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు సూరి మాట్లాడుతూ ప్రభుత్వం మా డిమాండ్లను పరిష్కరించడంలో విఫలం చెందుతుందని ముఖ్యంగా తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 26000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు ప్రస్తుతం 15000 ఇస్తున్నారని దీనిలో 2000 ఈఎస్ఐ పిఎఫ్ కు ఒకసారి చేసి 13000 మాత్రమే జీతం ఇస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ధరలు ప్రకారము ఇదే మాత్రం కుటుంబం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు ప్రభుత్వం వెంటనే తమకు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.




# రంజాన్ సేవలు మరువలేనివి : రెడ్ డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 15 (శుభోదయం న్యూస్): లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ స్థాపించి ఎందరికో ప్రాణదానం చేసిన వ్యవస్థాపకుడు రంజాన్ సేవలు మరువలేనివని రెడ్ డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్ డ్రాప్ బ్లడ్ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు రంజాన్ సభ్యులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో రెడ్ డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడురహిమాన్ అధ్యక్షుడు గులాం మహమ్మద్ తోపాటు సభ్యులు పాల్గొన్నారు.


# భాష్యం పాఠశాలపై చర్యలు తీసుకోండి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్ నాయక్ అధ్యక్షులు అక్షయ్




గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 15 (శుభోదయం న్యూస్) : భాష్యం పాఠశాలలో విద్యను వ్యాపారం చేస్తూ పుస్తకాల పేరిట లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం భాష్యం పాఠశాల ముందు భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్సార్ యురాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్ నాయక్ అధ్యక్షులు అక్షయ్ మాట్లాడుతూ గుంతకల్ పట్టణంలో భాష్యం విద్యా సంస్థలు చేస్తున్న విద్యా దోపిడీ విద్యా మాఫియా పై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతూ వేల రూపాయలు వ్యాపారం చేస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పట్టణంలో వివిధ కోర్సులు అనుమతి లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు ఈ ఫీజుల దోపిడి మీద జిల్లా డీఈవో గారు ఇంతవరకు ఏం మాత్రం స్పందించలేదని మండిపడ్డారు. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 15వేల రూపాయల నుంచి 22వేల రూపాయల వరకు పుస్తకాలు అమ్ముతున్నారని మండిపడ్డారు. జిల్లాలో రాష్ట్రంలో వచ్చేటువంటి ర్యాంకులను జిల్లాలో వచ్చినట్టు తప్పుడు ప్రచార ఫ్లెక్సీలు వేసుకొని విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు పట్టణంలో విద్యాసంస్థలకు క్రీడా మైదానం లేకపోయినప్పటికీ, విద్యార్థులను క్రీడల వైపు వెళ్లకుండా యంత్రాల్లాగా తయారు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖ మంత్రి గుంతకల్ పట్టణం భాష్యం విద్యా సమస్యలు చేస్తున్న విద్యా దోపిడీ విద్య మాఫియా పై స్పందించాలని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యా దోపిడి అరికట్టకపోతే త్వరలో రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులు కలిసి జిల్లా విద్యాశాఖ అధికారులపై ఫిర్యాదు చేయవలసి వస్తుందని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో వైయస్సార్సిపి నాయకులునాయకులు వాల్మీకి సాయి మణికంఠ పవన్ ఏఐఎస్ఎఫ్ పట్టణ సహాయ కార్యదర్శి ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు శ్యాంసుందర్ లోకేష్ అబ్దుల్ ఎన్ ఎస్ యు ఐ నాయకులు స్రవంత్ అశోక్ తదితరులు పాల్గొన్నారు

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి కర్తవ్యం : న్యాయవాది డాక్టర్ బి.ఎస్.కృష్ణారెడ్డి



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు, జూన్ 15 (శుభోదయం న్యూస్): పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి కర్తవ్యం అని న్యాయవాది డాక్టర్ బి.ఎస్.కృష్ణారెడ్డి అన్నారు శనివారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల నుమున్సిపల్ సిబ్బంది తొలగిస్తున్న నేపథ్యంలో వారికి తగు సూచనలను ఆయన అందజేశారు.

# గోదావరిఖనిలో రూ.26 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్

## అభివృద్ధి పనులను పర్యవేక్షించిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం, మండలం, రిపోర్టర్– తిరుపతి, (శుభోదయం న్యూస్): రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఈరోజు గోదావరిఖని పట్టణం చౌరస్తా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న రూ.27 కోట్ల విలువైన షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులను సింగరేణి సంస్థ మరియు మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతిని వివరణగా అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యత, నిర్మాణ వేగం మరియు పారదర్శకతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ



గోదావరిఖని ప్రజలకు ఆధునిక వాణిజ్య సదుపాయాలు కల్పించడమే ఈ షాపింగ్ కాంప్లెక్స్ లక్ష్యం. ఇది ఒక వైపు నగర అభివృద్ధికి దోహదం చేస్తే, మరోవైపు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. అని అన్నారు. ఇతర అభివృద్ధి పనులతో పాటు ఈ ప్రాజెక్టు కూడా నగర ముఖచిత్రాన్ని మార్చనున్నదని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు అందించడమే మా ప్రభుత్వ ధ్యేయం. సింగరేణి మరియు మున్సిపల్ అధికారులతో సమన్వయం కలిగిన విధంగా ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయాలని ఆదేశించాను. అని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యవేక్షన కార్యక్రమంలో సింగరేణి అధికారులు, మున్సిపల్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్లు, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులు మరియు సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. పనుల ప్రగతిపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల్లో ఈ ప్రాజెక్టుపై మంచి ఆసక్తి నెలకొంది. ఇది పూర్తయిన తర్వాత గోదావరిఖని ప్రాంతం వ్యాపారాభివృద్ధిలో ఒక ప్రధాన కేంద్రంగా మారుతుందనే నమ్మకం వ్యక్తమవుతోంది. వీరి వెంట షాపింగ్ కాంప్లెక్స్ సంబంధిత అధికారులు ఇంజనీర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మజ్జి కార్పొరేటర్లు వివిధ వియుగల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

# పెద్దపల్లి జిల్లా కేంద్రం

## ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మండల ఇంచార్జ్ ల సమావేశం



గోదావరిఖని టౌన్, రిపోర్టర్– సురేష్,(శుభోదయం న్యూస్): పెద్దపల్లి జిల్లా కేంద్రం సితార లాడ్జిలో ఎమ్మార్పీఎస్. ఎంఎస్పి మండల ఇన్చార్జీ ల సమావేశం జరిగినది. ఈ సమావేశానికి జిల్లా ఇంచార్జ్ వెంకటేశ్వర రావు మాదిగ పాల్గొన్నారు. ఇన్చార్జిల ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో మండల సమావేశాలు జరిపి నూతన గ్రామ కమిటీ నిర్మాణం ఎంతవరకు జరిగినది. ఎన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలు ఉన్న వి . గద్దెలు లేని చోట కొత్త గద్దెలు కట్టించి 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జులై 7న ఘనంగా నిర్వహించాలని. అందుకోసం వెంటనే గ్రామ కమిటీల నిర్మాణం పూర్తి చేసి భవిష్యత్తు ఉద్యమానికి జాతిని సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్సీ జిల్లా అధ్యక్షులు మంతిని చందు మాదిగ సభ అధ్యక్షత వహించగా మండల ఇంచార్జీ కొండల రాజేందర్ మాదిగ. కన్నూరి ధర్మేందర్. పల్లె బాపు మాదిగ. మడిపల్లి దశరథం. అగ్గిమల్ల కొమురయ్య మాదిగ. మాటూరి ఉపేందర్ మాదిగ. పెరిక సాగర్ మాదిగ. అట్లూరి గంగారాం మాదిగ. రమేష్ మాదిగ. కొమరయ్య. రాము మాదిగ. మరియు తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి

## నగరపాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకటస్వామి




గోదావరిఖని టౌన్, రిపోర్టర్– సురేష్, (శుభోదయం న్యూస్): వర్షాకాలంలో అంటువ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి సూచించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం సంజయ్ గాంధీ నగర్, సంతోష్ నగర్ ( 8 ఇంక్ లైన్ కాలనీ ) ,రామగుండం ప్రాంతాలలో నిర్వహించిన అవగాహన



కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ,చెత్త బయట పడవేయకుండా ఇంటి ముందుకు వచ్చే మునిసిపల్ వాహనానికి అందించాలని, నిలువ ఉన్న నీటిని తొలగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మునిసిపల్ సిబ్బంది దోమల పెరుగుదల నివారించడానికి రసాయనాల స్ప్రే, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి,కిరణ్, మెప్మా సి ఓ లు శ్వేత, శమంత, ,ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, ఆర్ పి లు ,స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

# వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం



రామగుండం మండలం, రిపోర్టర్– తిరుపతి, (శుభోదయం న్యూస్): వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ముఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ సమావేశానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు కన్నం మేఘ స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికలాంగుల పోరాట సమితి జాతీయ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి జిల్లా ఇన్చార్జి పెద్దపల్లి సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. హైదరాబాదులో మందకృష్ణ మాదిగ కి పద్మశ్రీ అవార్డు ప్రభుత్వం ఇచ్చినందున వారిని పెద్ద ఎత్తున సన్మానించడం జరుగుతుంది. అదే సందర్భంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కార్యవర్గ సమావేశం మరియు భవిష్యత్ కార్యాచరణ పై చర్చ జరుగుతుంది. కావున వికలాంగులు అందరు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బైరి సుధాకర్ బొద్దుల సుమన్ ఉప్పులేటి పర్వతాలు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్న ప్రభుత్వాలు

## అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎ.ఐ.యు.కెఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కెచ్చల రంగారెడ్డి..




నర్సంపేట, శుభోదయం న్యూస్: దేశంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతూ, రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని అఖిలభారత ఐక్య రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కెచ్చల రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నర్సంపేట డివిజన్ కేంద్రంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఎ.ఐ.యు.కె.ఎస్) వరంగల్ జిల్లా ప్రథమ మహాసభ సందర్భంగా వరంగల్ రోడ్డు నుండి ఐఎంఏ హాల్ వరకు రైతు కూలీలు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు మైదం పాణి అధ్యక్షతన కామ్రేడ్ భోగా శ్రీరాములు (మాధవన్న) నగర్, ఐఎంఏ హాల్ లో మహాసభ జరిగింది. సభ ప్రారంభానికి ముందు మైదం పాణి జెండా ఆవిష్కరణ చేయగా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి రైతాంగ అమరవీరులను స్మరిస్తూ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టాగ మహాసభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కెచ్చల రంగారెడ్డి ప్రారంభో ఉపన్యాసం చేస్తూ దేశంలో పాలకులు కార్పొరేట్, పెట్టుబడిదారుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారి వ్యవసాయ రంగంలో రైతు వ్యతిరేక సంస్కరణలు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ముందు మోకరిల్లి దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నాడన్నారు. పాలకులెందరు మారిన రైతాంగం బాధలు మాత్రం మారటం లేదన్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో పెట్టిన పెట్టుబడి రాక అప్పుల పాలై ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎ.ఐ.యు.కె.ఎస్. తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్రన్న మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు దేశానికి రైతులు వెన్నుముక అంటూనే వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. ప్రభుత్వాలకు రైతుల పట్ల, వ్యవసాయ రంగ అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వ్యవసాయ రంగంలో ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ సూచించిన సిఫారస్ లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే దేశంలో రాష్ట్రంలో రైతాంగాన్ని ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహ రావు, జిల్లా అధ్యక్షులు అలువాల నరేష్, ఆయుర్వేద డాక్టర్ కృష్ణారావు లు మహాసభ ప్రతినిధులకు సందేశం ఇచ్చారు. అనంతరం 11 మందితో అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఎ.ఐ.యు.కె.ఎస్) వరంగల్ జిల్లా కార్యవర్గాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. అధ్యక్షులు అర్షం సుధాకర్, ఉపాధ్యక్షులు మైదం పాణి, కోళ్ల రాజు, సహాయ కార్యదర్శిలుగా గట్టి కొప్పుల రవి, కత్తుల కొమురయ్య, కోశాధికారిగా ధార లింగన్న, జిల్లా కమిటీ సభ్యులుగా మల్లేష్, అనంతరం మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. 1) రైతాంగానికి ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలి. 2)జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి. 3) రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. గిట్టుబాటు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలి. 4) వ్యవసాయ రంగంలో నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి. 5) నకిలీ విత్తనాలు ఎరువులు పురుగుమందులు అరికట్టాలి. 6) బ్యాంకులు రైతాంగానికి వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి. 7) పోడు భూములకు పట్టాలి ఇవ్వాలి.




# ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం చేసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



రామగుండం మండలం, రిపోర్టర్– తిరుపతి, (శుభోదయం న్యూస్): రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ శనివారం రోజున ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా రక్తదానం చేసి మానవతా విలువలకు గౌరవం చాటారు. తన ఉదాహరణతో యువతను రక్తదానానికి ప్రోత్సహిస్తూ మంచి సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, సింగరేణి అధికారులు, స్థానిక యువత, గణనీయమైన సంఖ్యలో రక్తదాతలు పాల్గొన్నారు. రక్తదానం చేసిన తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదానం ఒక ప్రాణదానం. ఇది చేసే వారు నిజమైన హీరోలు. ప్రతి ఆరోగ్యవంతుడు సంవత్సరానికి కనీసం రెండు సార్లు రక్తదానం చేయాలి. దీనివల్ల ఎదుటి వారి జీవితాన్ని రక్షించడమే కాకుండా, మన ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది" అని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త నిల్వలు ఎప్పుడూ భద్రంగా ఉండేలా చూడాలని, అత్యవసర సమయంలో ఎటువంటి లోటు లేకుండా ముందస్తు ఏర్పాట్లు ఉండాలన్నది ఎమ్మెల్యే గారి సూచన. ఆసుపత్రి వర్గాలు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు యువత రక్తదానం చేయడం విశేషం. రక్తదానం చేస్తూ యువతీ యువకులు జీవితం కోసం బహుమానం రక్తదానం అనే నినాదంతో ముందుకు రావడం గమనార్హం. అయితే, ఈ దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం రామగుండం నియోజకవర్గానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్స్ తదితరులున్నారు

# టియుడబ్ల్యూజే (ఐజేయు ) జిల్లా అధ్యక్షుడిగా మల్లావర్జుల వంశీ



గోదావరిఖని టౌన్, రిపోర్టర్– సురేష్,(శుభోదయం న్యూస్): జర్నలిస్టుల సంఘం టి యు డబ్ల్యూజె ( ఐజేయు )పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా మల్లావర్జుల వంశీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గోదావరిఖని ప్రాంతంలోని పలువురు పాత్రికేయులు రాజకీయ నాయకులు, అధికారులు మిత్రులు శుభాకాంక్షలు తెలియజేసినారు.

# ఘనంగా లింగాయత్ జిల్లా అధ్యక్షులు బస్వరాజ్ జన్మదిన వేడుకలు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ లింగ బలిజ జిల్లా అధ్యక్షులు అంబిలి బసవరాజ్ పటేల్ జన్మదిన వేడుకలు బీర్కూర్ మండల కేంద్రంలో గణంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల యువ నాయకులు శశికాంత్, మాజీ ఎంపీటీసీ సందీప్ పటేల్,మాజీ కో ఆప్షన్ ఆరిఫ్,కోరిమే రఘు,పత్రిక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# విట్టలేశ్వరాలయానికి 8 గ్రాముల బంగారం విరాళం అందజేత



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని బైరాపూర్ గ్రామంలో తెలంగాణ పండరీపూర్ గా ప్రసిద్ధిగాంచిన బైరాపూర్ విఠలేశ్వర ఆలయానికి నేడు హైదరాబాద్ కు చెందిన పూజిత లోకేశ్వరరావు దంపతులు 80 వేల విలువైన 8 గ్రాముల బంగారం విరాళంగా అందజేశారు దాతలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# గొంగడి కి యునెస్కో గుర్తింపు లభించడం గర్వకారణం - బీరుగొండ



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో కురుమల సామాజిక వర్గానికి సాంప్రదాయ వస్త్రం గా ఉన్న గొంగడికి యునెస్కో గుర్తింపు లభించడం గర్వకారణం. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 47 విశిష్ట చేనేత సాంప్రదాయ వస్త్రాలు ఉన్నట్టు యునెస్కో గుర్తించింది. చలికాలంలో వెచ్చగా,ఎండాకాలంలో చల్లగా, వర్షాకాలంలో మంచి తడవకుండా ఉండటం దీని ప్రత్యేకత అని బీరుగొండ తెలిపారు.

# ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేసిన యువకులు



ములుగు జిల్లా ప్రతినిధి నారాయణమూర్తి ( శుభోదయం న్యూస్): ములుగు జిల్లా వ్యాప్తంగా ప్రపంచ రక్త దాతల దినోత్సవం అన్ని మండలాల్లో జరిగినది. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు ) మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రపంచ రక్త దాతల శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, వైద్యాధికారి వారి సిబ్బంది పాల్గొన్నారు. తాసిల్దార్ మాట్లాడుతూ! ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో ప్రజలకు రక్తం విలువ తెలిపే ఉద్దేశంతో ప్రపంచ రక్త దాతల దినోత్సవం ఏటా జూన్ 14న నిర్వహిస్తారు. మొదటిసారిగా 19%శీ%1 లో ఆస్ట్రేలియాకు చెందిన నోబెల్ విజేత కార్ల్ లాండ్ స్టీనర్ మొదటిసారిగా రక్తాన్ని వర్గీక రించాడు. ఆయన జయంతి గుర్తుగా రక్తదాతల దినోత్సవం 2004లో అన్ని దేశాలలో జరుపుకుంటున్నారు అని వివరించారు. వైద్యాధికారి రక్తదానం వలన ఉపయోగం గురించి వివరిస్తూ! రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడం కుదరదని, రక్త దాతలు ఎవరికైనా రక్తాన్ని దానం చేసి మరొక ప్రాణాన్ని కాపాడవచ్చు, 18 సంవత్సరాల నుండి 55 ఏళ్ల లోపు రక్తదానం చేయవచ్చు కనీసం రక్తదాతల శరీర బరువు 50 కిలోలు ఉండాలి ప్రమాదాల సమయంలో వ్యక్తి శరీరంలో తగినంత రక్తం లేకపోతే మరొకరి రక్తం ఎక్కించవచ్చు, ఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. ఈ సదస్సుకు కాంగ్రెస్ పార్టీ తరపున చిడెం మోహన్ రావు,సయ్యద్ హుస్సేన్, గుండమ్మల కిరణ్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని యువకులు రక్తాన్ని దానం చేశారు.

## ఫ్రెండ్లీ పోలీసులకు నిర్వచనమే... ఈ పోలీసు అధికారులు



గుంతకలు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు, జూన్ 15 (శుభోదయం న్యూస్) : పోలీస్ అంటేభయం అయితే తప్పు చేసిన వారికి భయం ఎలాంటి తప్పు చేయని వారు కూడా పోలీస్ స్టేషన్ వెళ్లాలంటే కొద్దిగా భయంగా ఉంటుంది ఎందుకు అంటేఅది పోలీసుల పవర్ ఇదేనా అనిపించేదిగా ఉంటుంది ఆ స్టేషన్ ఆఫీసర్ ప్రజలతో మసులుకొనే తీరును బట్టి ఆ పోలీస్ స్టేషన్ యొక్క గుర్తింపు ఉంటుంది గుంతకల్ పట్టణంలో వన్ టౌన్ టూ టౌన్ సిఐలుగా పదవి చేపట్టిన బి మనోహర్, ఏపీ మస్తాన్ 10 నెలల క్రితం ఆయా టౌన్లలో పదవి చేపట్టారు అయితే వారు ప్రజల నుండి ప్రశంసలు పొందారు అనడంలో అతిశయోక్తి లేదు వీరు ప్రజలతో



ప్రవర్తించే గౌరవప్రదమైన తీరు పోలీస్ ఫ్రెండ్లీ పోలీస్ అనే గుర్తింపును తెచ్చి పెట్టారు ప్రజలు పోలీస్ స్టేషన్కు వీరి వద్దకు వస్తే గౌరవంగా మాట్లాడించి సమస్యను వింటూ పరిష్కరిస్తూ ముందు పోతున్న వైనం పట్టణ ప్రజల నుఆకర్షించింది ప్రజలు తమ వద్దకు సమస్యల పరిష్కారానికి వచ్చిన తక్షణమే పరిష్కరించే దిశగా వీరు అడుగులు వేస్తున్నారు వన్టౌన్ పరిధిలో 2 టౌన్ పరిధిలో పోట్లాటలు ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ఉంది అయితే ఆసాంఘిక కార్యకలాపాలపై వీరిద్దరూ ఉక్కు పదం మోపారు ముఖ్యంగా బెట్టింగులు జూదం, మట్కా, గంజాయి వంటి వారిపై కఠిన చర్యలు కూడా తీసుకున్నారుఅయితే తప్పు చేసిన వారిపై చట్టరీత్య వీరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి వన్టౌన్ సీఐ గా గత పది నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన బి మనోహర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వస్తున్న ప్రజలు మర్యాదపూర్వకంగా పలకరించి వారి ఫిర్యాదులను ఆయన స్వీకరించి ఆ ఫిర్యాదులను క్రింది అధికారులకు పంపించి పరిష్కరించి దిశగా ఎన్నో చేశారు ఎప్పుడు కూడా తన వద్దకు వచ్చే ప్రజలను ఎప్పుడు కూడా అగౌరవంగా ఆయన మాట్లాడిన సందర్భాలు ఈ పది నెలల్లో ఒక్కటి కూడా లేవు టూ టౌన్ సీఐ ఏపీ మస్తాన్ బాధ్యతలు చేపట్టి తొమ్మిది నెలలు కావస్తున్న ఆ స్టేషన్లో కూడా తన కలవడానికి వచ్చిన ప్రజలను ఫిర్యాదులు చేయడానికి వచ్చిన వారిని గౌరవంగా మాట్లాడించి వారి ఫిర్యాదులు స్వీకరించిన సందర్భాల్లో కో కొల్లలు దీనికి తోడు ఈ ఇరువురు సిఐలు ఎన్నో కేసులను ఛేదించారు అందుకే వీరిద్దరిని ఫ్రెండ్లీ పోలీస్ అధికారులుగా ప్రశంసలు అందుకుంటున్నారు.

## ఆర్డిటి పరిరక్షణకు పాదయాత్ర చేస్తున్న తలారి రంగయ్యకు మద్దతు ప్రకటించిన మెట్టు గోవిందరెడ్డి



కనేకల్, మండల విలేఖరి - మాల్యం కిరణ్ కుమార్, జూన్ 15 (శుభోదయం న్యూస్) : ఆర్డిటి పరిరక్షణ కోసం పాదయాత్ర చేపట్టిన మాజీ ఎంపీ కళ్యాణదుర్గం వైసిపిఇన్చార్జ్ తలారి రంగయ్య కు రాయదుర్గం వైఎస్ఆర్సిపి నాయకుడు మెట్టు గోవిందరెడ్డి ఆయన కలిసి తన సంఘీభావం ప్రకటించారు ఈ కార్యక్రమంలో రాయదుర్గం నియోజకవర్గం వైసీపీ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఉషారాణి కనేకల్ మండలం కన్వీనర్ పాటిల్ బ్రహ్మానంద రెడ్డి వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షులు మారంపల్లి మారెన్న నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లింగసముద్రం యోగాంధ్ర కార్యక్రమం



లింగసముద్రం, మండలం రిపోర్టర్ - కె సురేష్ (శుభోదయం న్యూస్): లింగసముద్రం యోగలో భాగంగా తేదీ: 14.06.2025 న ఉదయం 8 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయము లింగసముద్రం నందు మండల స్థాయి యోగ మాస్ డిమాంస్ట్రేషన్ ఈవెంట్ ను శ్రీ కట్టా శ్రీనివాసులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి సమక్షంలో మండల స్థాయి ఎమ్ ఒ టీ అయిన శ్రీ సి. హెచ్ వెంకటకృష్ణ, పీడీ జడ్పీ హై స్కూల్ పెదపవని వారి ద్వారా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమమునకు లింగసముద్రం గ్రామపంచాయతీ నాయకులైన శ్రీ గాలంకి ప్రసాద్ మరియు శ్రీ అడపా రంగయ్య వారలు హాజరు కావడం జరిగినది. మరియు మండలంలోని 13 గ్రామ



సచివాలయాలలో ఒక్కొక్క గ్రామ సచివాలయం నందు 9 వెన్యూ లు చొప్పున మొత్తం 117 గ్రామస్థాయి యోగ మాస్ డిమాంస్ట్రేషన్ ఈవెంట్లు నిర్వహించడం జరిగినది. గ్రామస్థాయిలో ముత్యాలపాడు గ్రామపంచాయతీ నుండి శ్రీ కంకణాల సుబ్బులు నాయుడు మరియు శ్రీ కొండూరు అశోక్ కుమార్ మరియు పెదపవని గ్రామపంచాయతీ నుండి శ్రీ షేక్ రఫీ మరియు గొర్రెపాటి సాంబయ్య మొదలకు పలువురు నాయకులు హాజరు కావడం జరిగినది.

## మానవ హక్కులకు భంగం కలిగించవద్దు డివిజనల్ చైర్మన్ తాళ్లురి సౌరిబాబు




పిడుగురాళ్ల, శుభోదయం న్యూస్: పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ డివిజనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన డివిజనల్ చైర్మన్ తాళ్లురి సౌరిబాబు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంగన ఎక్కడైతే జరుగుతుందో అక్కడ నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు ఉంటారని తెలిపారు. రానున్న రోజుల్లో డివిజనల్ పరిధిలో ఉన్న ఆరు జిల్లాల్లో కమిటీలు పూర్తిచేసి క్షేత్రస్థాయిలో అవినీతి అక్రమాలపై ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ కమిటీ సభ్యులు,పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు,వివిధ నియోజకవర్గాల కమిటీ సభ్యులు,మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యం





(శుభోదయం న్యూస్) బిట్రగుంట: ప్రతిఒక్కరూ యోగ, ధ్యానంవంటివి చేయడంవలనఆరోగ్యంగా ఆనందంగాఉండేఅవకాశం ఉందనిమండలపరిషత్ అభివృద్ధి అధికారిసుబ్రమణ్యంఅన్నాడు. రాష్ట్రప్రభుత్వం,కేంద్రప్రభుత్వం ఈనెల21వతేదీనయోగా దినోత్సవంప్రతిష్టాత్మకంగా జరపాలన్నఉద్దేశంతోఅధిక సంఖ్యలోయోగాదినోత్సవంనాడు ప్రజలుయోగచేసేలా అవసరమైనటువంటిఅవగాహన కార్యక్రమాల్నిఇప్పటికే మండలంలోప్రతిసచివాలయంలో నిర్వహించడంజరిగిందన్నారు. శనివారంమండలపరిషత్ కార్యాలయంబయట మండలంలోనిసచివాలయ సిబ్బంది,అంగన్వాడీవర్కర్లు, అంగన్వాడిసూపర్వైజర్లు,ఆశ వర్కర్లు,వైద్యసిబ్బంది,మండల విద్యాశాఖఅధికారులుమహాత్మా గాంధీజాతీయఉపాధిహామీ పథకంసిబ్బందివివిధశాఖల అధికారులుపాల్గొన్నారు.

## యోగా జీవిత విధానం కావాలి..



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల పరిధి రాతన గ్రామంలో యోగా ఆవశ్యకతను చాటి చెప్పేందుకు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలకు ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోందని ప్రతి ఒక్కరూ యోగా ను జీవిత విధానం గా అలవర్చుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని యోగ గ్రామ విఆర్ఓ నాగేంద్ర .పంచాయతీ సెక్రెటరీ శివకుమార్ .వెల్ఫేర్ అసిస్టెంట్ రాము .అగ్రికల్చర్ ఎజికల్. అంగన్వాడి సిబ్బంది సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు సచివాలయం మైదానంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. తొలుత ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా మండలంలో ప్రభుత్వ యంత్రాంగం అన్ని గ్రామ పంచాయతీ లలో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగ ఔత్సాహికులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమం లో ప్రజలు పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మండలంలో ఈనెల జూన్ 21 నాటికి కనీసం సగం మందికి యోగాస నాలను నేర్పించేందుకు ప్రతి గ్రామం లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా మంది దాకా రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామం లో 'నూ యోగాంధ్ర కార్యక్రమాలను జరుగుతున్నం దున అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమాల్లో పాల్గొని విజంతం చేయాలని కోరారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి యోగాసనాలను చేరువగా చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. యోగ పై అవగాహన పెంచుకొని యోగాసనాలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## యోగా జీవిత విధానం కావాలి...




తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): యోగా ఆవశ్యకతను చాటి చెప్పేందుకు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలకు ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోందని ప్రతి ఒక్కరూ యోగా ను జీవిత విధానం గా అలవర్చుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని యోగ మండల నోడల్ అధికారి డాక్టర్ జి అమర్నాథ్, తహసిల్దార్ రమాదేవి, ఎంపీడీవో విశ్వ మోహన్, డిప్యూటీ ఎంపీడీవో పి. శ్రీహరి, సూపర్డెంట్ భాష తుగ్గలి సర్పంచ్ రవి, మాజీ వైస్ ఎంపీపీ లు విజయభాస్కర్, చంద్రశేఖర్ యాదవ్ ,టిడిపి మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు లు అన్నారు తెలిపారు. శనివారం తుగ్గలి, ఎర్రగుడి రాంపల్లి గ్రామాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు



మాట్లాడుతూ యోగాంధ్ర మహోత్సవాల్లో ప్రభుత్వ యంత్రాంగం అన్ని గ్రామ పంచాయతీ లలో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగ ఔత్సాహికులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమం లో ప్రజలు పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈనెల జూన్ 21 నాటికి సగం మందికి యోగాస నాలను నేర్పించేందుకు ప్రతి గ్రామం లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా మంది దాకా రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామం లో 'నూ యోగాంధ్ర కార్యక్రమాలను జరుగుతున్నం దున అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరికి యోగాసనాలను చేరువగా చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. యోగ పై అవగాహన పెంచుకొని యోగాసనాలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆగస్టిన్, రామానాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు చందు నాయక్, వేణు, హనుమన్న, పాండు, విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి లు రామకృష్ణ, పులి రాజు, జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం, హెల్త్ సూపర్వైజర్ వెంకటరమణయ్య, ల్యాబ్ టెక్నీషియం మౌలాలి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంబిక, త్రివేణి, ఉపాధ హామీ జూనియర్ ఇంజనీర్ లు రాజశేఖర్, చిన్న ఎంకప్ప, సచివాలయ ఇంజనీర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరి లక్ష్మీ నరసింహుడు, స్వర్ణగిరి వేంకటేశుడి ని దర్శించుకున్న కూన శ్రీనివాస్ గౌడ్

",:యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వరా స్వామి దేవస్థానాన్ని కెకెఎం ట్రస్ట్ చైర్మన్,కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు..అనంతరం వేద పండితుల ఆశీర్వచనల మధ్య స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమం లో నేమూరి రాములు గౌడ్, వెంకటేష్ పటేల్, బాలప్ప, శ్రీనివాస్, చిట్టిబాబు, రమేష్ గౌడ్, శ్రీరాములు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు

## పెద్దపల్లి రూరల్ ఎస్సై ని మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లి పట్టణం లోని రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై మల్లేశం ను శనివారం రాఘవాపూర్ కాంగ్రెస్ నాయకులు కుమ్మరి తిరుమల్, కల్వల రామస్వామి లు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఆనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్ తినిపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ (టి జి పి ఏ) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటి కన్వీనర్ మరియు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్, మంథని బాలురు గురుకుల పాఠశాల కళాశాల పేరెంట్స్ కమిటి చైర్మన్ దార మధు, రియల్ ఎస్టేట్ సోల్లు రఘుపతి, కుమ్మరి సాగర్, బొంకూరి సాగర్, కల్వల అమన్ కుమార్ లు పాల్గొన్నారు.

## యాదగిరి లక్ష్మీ నరసింహుడిని, స్వర్ణగిరి వేంకటేశుడి ని దర్శించుకున్న కూన శ్రీనివాస్ గౌడ్

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వరా స్వామి దేవస్థానాన్ని కెకెఎం ట్రస్ట్ చైర్మన్,కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు..అనంతరం వేద పండితుల ఆశీర్వచనల మధ్య స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమం లో నేమూరి రాములు గౌడ్, వెంకటేష్ పటేల్, బాలప్ప, శ్రీనివాస్, చిట్టిబాబు, రమేష్ గౌడ్, శ్రీరాములు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు

## దళిత సేవారత్న అవార్డును అందుకున్న దుర్గం ప్రమీల నగేష్ దంపతులు

### దుర్గం ప్రమీల నగేష్ దంపతుల సేవలు గొప్పవి

### సామాజిక సేవలకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప గుర్తింపు

### రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్

పెద్దపల్లి జిల్లా ఎన్టిపిసి అన్నపూర్ణ కాలనీకి చెందిన సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు, సమతా ఫౌండేషన్, సమతా గ్రంథాలయ నిర్వాహకులు దుర్గం ప్రమీల నగేష్ దంపతులు దళితసేవా రత్న అవార్డును 2025 సంవత్సరానికి డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్, డాక్టర్ జగ్జీవన్ రామ్ జయంతుల తెలంగాణ రాష్ట్ర ఉత్సవాల కమిటి ఎంపిక చేసినది. ఈ మేరకు శనివారం రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ చేతుల మీదుగా దుర్గం ప్రమీల నగేష్ దంపతులు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుర్గం ప్రమీల నగేష్ దంపతులను శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ దుర్గం ప్రమీల నగేష్ దంపతులు ప్రజా సేవ లో భాగంగా డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో, పే బ్యాక్ టు దా సొసైటి నినాదంతో సమతా సైనిక దళ్, సమతా ఫౌండేషన్ ల ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తూ, కరోనా విపత్కర సమయంలో ఎంతో మంది నిరుపేదలకు నిత్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేసినందుకు, నిరుపేదలకు విద్యా, వైద్యం, ఉపాధి మొదలైన సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు, రక్తదానం, విద్యాదానం, సేవాదానం, ఉద్యమాలు, పోరాటాలు, ఇతర సేవలతో, పౌర హక్కులు, మానవ హక్కులు, అవినీతి, అక్రమాలు దోపిడి నిర్మూలనకు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషికి, ఇటీవల తమ ఇంటినే లైబ్రరీగా మార్చి సమత లైబ్రరీని ప్రారంభించి బాలలకు జ్ఞానం పెంపొందిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం మంచి గుర్తింపు నిచ్చిందన్నారు. అవార్డు గ్రహీతలు దుర్గం ప్రమీల నగేష్ లు మాట్లాడుతూ అవార్డు తో తమ పై మరింత బాధ్యత పెరిగినదని సమాజసేవకు 24/7 తమ శక్తివంచన మేరకు కృషి చేస్తామని తెలిపారు. తాము చేసే సేవా కార్యక్రమాలకు వెన్నంటి ఉంటు సహకరిస్తున్న సమతా సైనిక దళ్, సమతా ఫౌండేషన్, నేతకాని సంఘం సభ్యులకు, ఈ అవార్డు ఎంపికకు కృషి చేసిన డాక్టర్ లక్ష్మీదేవి

శుభోదయం

సంపాదకీయం

## ఔషధాల తయారీలో నాణ్యత ప్రమాణాలు ముఖ్యం

(విశ్లేషణ)

భారత్ నుంచి వచ్చే ఫార్మాస్యూటికల్స్‌తో సహా అనేక కేటగిరీల దిగుమతులపై 25% టారిఫ్ విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం అనేక ప్రకంపనలకు దారితీస్తోంది. ఇలాంటి ప్రతీకార సుంకాలవల్ల భారత్‌లోని ఫార్మారంగానికి ఎదురయ్యే సమస్యలు ఎలా ఉన్నా అమెరికా ఆరోగ్య భద్రతా వ్యవస్థకే ఎక్కువ నష్టం కలుగుతుందని అనేక మంది నిపుణులు ఉదహరిస్తున్నారు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తుల్లో జనరిక్, భారీ డ్రగ్స్, వ్యాక్సిన్లు, కేన్సర్, ఇతర సంక్లిష్ట వ్యాధుల నివారణకు అవసరమయ్యే బయోసిమిలర్స్ ఉంటాయి. అమెరికాలో ప్రిస్క్రైబ్ చేసిన సగానికి మించి జనరిక్ ఔషధాలు భారత్‌నుంచి ఎగుమతి అవుతున్నవే. భారత్, చైనా నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే అతి చవకైన జనరిక్ ఔషధాలవల్ల అమెరికా ఆరోగ్యభద్రతా వ్యవస్థ 2022లో 408 బిలియన్ డాలర్ల వరకు ఆదా చేయగలిగింది. భారత్‌కు చెందిన 50 బిలియన్ డాలర్ల ఫార్మా పరిశ్రమకు చెందిన సగానికి సగం ఎగుమతులు ప్రపంచం మొత్తం ఎగుమతుల్లో మూడో స్థానంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ నుంచి దిగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులపై అత్యధిక సుంకాలు విధించడం కేవలం భారత ఔషధ కంపెనీలకే కాదు, అమెరికా ప్రజారోగ్య వ్యవస్థపై కూడా తీవ్ర పరిణామాల ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఈ పరిస్థితుల్లో భారత ఫార్మారంగం తాను ఉత్పత్తి చేసే ఔషధాల నాణ్యతలో ఎలాంటి కళంకం లేకుండా ఉన్నత ప్రమాణాలు పాటించవలసి ఉంది. గతంలో భారత్‌లో తయారైన ఔషధాలు రోగులపై దుష్పరిణామాలు కలిగిస్తున్నాయని విదేశాల్లో చెడ్డపేరు తీసుకొచ్చిన సంఘటనలు జరిగాయి. కామెరాన్, గాంబియా, ఉజ్బెకిస్థాన్ దేశాల్లో పిల్లల మరణాలకు భారత్ నుంచి వచ్చిన ఔషధాల వాడకమే కారణమైందన్న అప్రతిష్ఠ వచ్చింది. గాంబియాలో దగ్గు, జలుబునుంచి ఉపశమనం పొందడానికి వాడే సిరప్‌లతో 66 మంది చిన్నారులు మృత్యువాతపడడం సంచలనం కలిగించింది. భారత్‌లో ఓ కంపెనీ తయారు చేసిన సిరప్‌లే చిన్నారులను బలి తీసుకున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఈ సిరప్‌ల వల్లనే అనేక మంది కిడ్నీలు దెబ్బతిన్నాయని పేర్కొంది. అంతేకాదు ఈ మందుల దుష్ఫలితాలపై ఇతర దేశాలను కూడా హెచ్చరించింది. భారత్‌లోని హర్యానాలో మైడెన్ ఫార్మా స్యూటికల్స్ తయారు చేసిన సిరప్‌లే చిన్నారులను బలిగొన్నాయని సాక్షాత్తు ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ వెల్లడించడం చెప్పుకోతగ్గది. దీనిపై ఆనాడు భారత ప్రభుత్వం దర్యాప్తు చేపట్టి చిన్నారుల మృతికి కారణమైన సిరప్‌లను ఆ సంస్థ అసలు భారత్‌లోనే విక్రయించలేదని, కేవలం విదేశాలకు ఎగుమతి చేయడానికే తయారు చేశారని ప్రకటించింది. దీన్ని బట్టి విదేశాలకు భారత్ నుంచి ఎగుమతి అవుతున్న ఔషధాల్లో నాణ్యత ఎంత లోపభూయిష్టంగా ఉంటోందో వెల్లడవుతోంది. ఈ పరిస్థితుల్లో భారత్‌లో ఔషధాల తయారీ నాణ్యతపై దృష్టి కేంద్రీకరించవలసి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ట్రంప్ విధించిన 25% టారిఫ్‌ల ప్రభావ అవకాశాలను దేశీయ ఔషధ పరిశ్రమ అర్థం చేసుకుంటున్న తరుణంలోనే మరో కళంకం తెరపైకి వచ్చింది. ముంబై కేంద్రంగా ఉన్న ఏవియో ఫార్మాస్యూటికల్స్ విదేశాల్లో అక్రమంగా ఔషధాలను విక్రయిస్తోందని బయటపడడం, దీనిపై దర్యాప్తు ప్రారంభం కావడం ఆలోచించవలసిన అంశం. ఈ కంపెనీ పశ్చిమాఫ్రికా దేశాల్లో తమకు విక్రయించే లైసెన్సు లేకున్నా ఓపియాయిడ్స్ (నల్లమందు గసగసాల మొక్కలో లభించే సహజ పదార్థాల నుంచి ఉత్పన్నమయ్యే ఔషధాలు)ను ఎగుమతి చేస్తున్నట్టు బిబిసి పరిశోధనలో బయటపడింది.ఈ నివేదికతో నైజీరియా, ఘనా, కోటే డి ఐవోయిర్ తదితర దేశాల ప్రజారోగ్యవ్యవస్థల్లో ఆందోళన చెలరేగింది. ఏవియో సంస్థ టాపెంటాడోల్ అనే స్ట్రాంగ్ ఓపియాయిడ్‌తో, కండరాల సడలింపునకు వాడే ఔషధం కారిసోప్రోడాల్‌తో కలిపి తయారు చేస్తున్నట్టు బయటపడింది. ఈ మాత్రల దిగుమతులను నైజీరియా 2018లో నిషేధించిన తరువాత భారత్‌లో కూడా దీనిపై నియంత్రణ చర్యలు మరింత కఠినతరం చేశారు. అన్ని రకాల అనుమతులు లేని టాపెంటాడోల్, కారిసోప్రోడాల్ కాంబినేషన్ల ఎగుమతులకు క్లియరెన్స్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 21న ఇండియా డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఉపసంహరించింది. అనేక సంవత్సరాలుగా భారత్‌లో తయారవుతున్న ఔషధాలు విషపూరితమని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అభ్యంతరాలు చెప్పడంతో విదేశాల్లో తిరస్కారం ఎదురైంది.ఔషధాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, సమగ్రత లోపించిన డేటా, నిబంధనల ఉల్లంఘన ఫలితంగా ఔషధ ఉత్పతులు చెల్లుబాటు కావడంలేదు.

# అమెరికాతో వాణిజ్య యుద్ధం.. భారత్ కోసం ఓ మెట్టు దిగిన చైనా



: భారత్- చైనా మధ్య సంబంధాలు సానుకూలంగా పురోగతిని సాధించాయని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ అన్నారు. న్యూఢిల్లీ-బీజింగ్ పరస్పరం విరోధం పెంచుకొనే కంటే భాగస్వాముల్లా కలిసి పనిచేయడం ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై మీడియాతో మాట్లాడారు. ఆసియాలోనే కీలకమైన తమ రెండు దేశాల మధ్య సహకారం అత్యంత ముఖ్యమన్నారు. వాంగ్ యీ మాట్లాడుతూ.."చైనా-భారత్ భాగస్వాములుగా పరస్పర విజయానికి సహకరించుకోవాలి. దీనిని సాధించడానికి డ్రాగన్-ఎలిఫెంట్ డ్యాన్స్ ఒక్కటే ఇరుపక్షాలకు ఉన్న సరైన మార్గం" అని వ్యాఖ్యానించారు. ఇరుదేశాలు పరస్పరం విరోధించుకునే కంటే.. ఒకరికొకరు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. పరస్పర సహకారమే రెండు దేశాల ప్రజల ప్రాథమిక ప్రయోజనాలను బలోపేతం చేస్తుందన్నారు. ఇరుదేశాల మధ్య వివాదాలను దౌత్యమార్గంలో పరిష్కరించుకొంటామని.. సమష్టి ప్రయోజనాలను కాపాడుకోవడానికి సహకారం అవసరమని వాంగ్ అభిప్రాయపడ్డారు. చర్చల ద్వారా పరిష్కారం కానీ సమస్యే లేదని.. సహకారంతో చేరుకోలేని లక్ష్యాలే లేవని చెప్పుకొచ్చారు. ఇక భారత్-బీజింగ్ మధ్య మెరుగైన సంబంధాలు ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ సౌత్ దేశాలకు కూడా లబ్ధిచేకూరుస్తాయన్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసి.. అంతర్జాతీయ వేదికలపై గ్లోబల్ సౌత్ స్థానాన్ని శక్తిమంతం చేస్తుందన్నారు. గత అనుభవాలను సంగ్రహించి.. వేగంగా ముందుకు సాగేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. ఇరుదేశాల సంబంధాలను స్థిరమైన అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ తో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉందన్నారు.

జీ20 విదేశాంగ మంత్రుల భేటీ తర్వాత..

దక్షిణాఫ్రికాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల భేటీలో భారత మంత్రి జైశంకర్‌తో చైనా మంత్రి వాంగ్ యీ భేటీ అయ్యారు. ఆ తర్వాత కొన్ని వారాల్లోనే ఈ ప్రకటనలు వెలువడ్డాయి. కాగా.. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత పలు విడతలుగా ఇరుదేశాలకు చెందిన దౌత్యవేత్తలు, సైనికాధికారులు చర్చలు జరిపారు. 2024లో ప్రధాని మోదీ-చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో భేటీ అయ్యారు. ఆ తర్వాతనే సరిహద్దుల్లో ఉద్రిక్తతలు ఉన్నచోట్ల నుంచి ఇరుదేశాల బలగాలు వెనక్కి తగ్గాయి. మరోవైపు, మరోవైపు ఈ ఏడాది షాంఘై సహకార సంస్థ సమావేశాలకు చైనా ఆతిథ్యం ఇస్తోంది. ఆ సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనడం అత్యంత కీలకంగా మారనుంది.

### అమెరికా ఎఫెక్ట్..

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత దిగుమతి సుంకాలను భారీగా పెంచారు. ప్రధానంగా కెనడా, మెక్సికో ఉత్పత్తులపై 25 శాతం చొప్పున, చైనా ఉత్పత్తులపై అదనంగా 10 శాతం సుంకాలు విధించబోతున్నామని ప్రకటించారు. మంగళవారం నుంచే ఇది అమల్లోకి వచ్చింది. దీనికి చైనా కూడా అంతే ఘాటుగా స్పందించింది. తమ దేశంలోకి దిగుమతి అయ్యే అమెరికా వస్తువులపై అదనంగా 15 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ క్రమంలోనే చైనా ప్రస్తుత చూపులు భారత్ వైపు పడ్డాయి. భారత్ తో గతంలో ఉన్న విరోధాన్ని పూర్తిగా పక్కన పెట్టేందుకు చైనా రెడీ అయ్యింది. ఈ నేపథ్యంలో ఓ మెట్టు దిగి భారత్ తో పనిచేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగ మంత్రి ఇలాంటి ప్రకటన చేయడం గమనార్హం.

# వంటనూనె తగ్గించండి.. వ్యాయామం చేయండి

### ఊబకాయానికి చెక్ పెట్టండి

### ప్రధాని మోదీ పిలుపు





సిల్వాస్సా: దేశంలో ఊబకాయ సమస్య నానాటికీ తీవ్రరూపం దాలుస్తుండడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. 2050 నాటికి 44 కోట్ల మంది భారతీయులు ఊబకాయులుగా మారుతారని అధ్యయనాలు చెబుతున్నాయని గుర్తుచేశారు. ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయంతో అవస్థలు పడే ప్రమాదం ఉందన్నారు. ఇది నిజంగా ప్రమాదకరమైన, దిగ్భ్రాంతి కలిగించే సంఖ్య అని చెప్పారు. ఒబేసిటీ అతిపెద్ద సవాలుగా మారిందని అన్నారు. ఊబకాయ సమస్యను అధిగమించడానికి వంట నూనెల వినియోగాన్ని కనీసం 10 శాతం తగ్గించుకోవాలని మరోసారి దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. వంట నూనెల విని యోగం తగ్గించుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేయాలని చెప్పారు. నిత్యం వ్యాయామం చేయాలని, శరీరంలో అవసరానికి మించి ఉన్న కొవ్వు శాతాన్ని తగ్గించుకోవాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలకు తక్కువ ధరకే ఔషధాలు అందించడానికి దేశవ్యాప్తంగా 25 వేల జన ఔషధి కేంద్రాలు ప్రారంభించబోతున్నామని తెలియజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని మెడికల్ షాపుల్లో ఔషధాలు కొనుగోలు చేయడం వల్ల మధ్య తరగతి ప్రజలు, పేదలకు ఇప్పటికే రూ.30,000 కోట్లు ఆదా అయ్యాయని వివరించారు. ప్రధాని మోదీ శుక్రవారం కేంద్ర పాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీలో పర్యటించారు. సిల్వాస్సా పట్టణం లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.2,587 కోట్ల విలువైన పలు అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.460 కోట్లతో నిర్మించిన 'నమో హాస్పిటల్'ను ప్రారంభించారు.

11 నుంచి మోదీ మారిషస్ పర్యటన

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 11వ తేదీ నుంచి మారిషస్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటన రెండు రోజులపాటు కొనసాగుతుందని విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. మారిషస్ ప్రధానమంత్రి నవీన్ రామ్‌గూలం ఆహ్వానం మేరకు మారిషస్ జాతీయ దినోత్సవంలో మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలియజేసింది.

రూ. 32 లక్షల కోట్లలో ఎన్ని సున్నాలో లెక్కించలేరు

### కాంగ్రెస్‌ను ఎద్దేవా చేసిన ప్రధాని మోదీ

సూరత్: చట్టసభల్లో సున్నా సీట్లు ఉన్న రాజకీయ పార్టీలు రూ.32 లక్షల కోట్లలో ఎన్ని సున్నాలు ఉంటాయో లెక్కించలేవని ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా కాంగ్రెస్ పార్టీని ఎద్దేవా చేశారు. 'ప్రధానమంత్రి ముద్రా యోజన' కింద పేదలకు ఇప్పటిదాకా రూ.32 లక్షల కోట్ల రుణాలు అందజేశామని చెప్పారు. ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులకు లబ్ధి చేకూర్చడానికి ఆదాయపు పన్ను మినహాయింపును రూ.12 లక్షల వరకు పెంచామని అన్నారు. శుక్రవారం గుజరాత్‌లోని సూరత్‌లో 'సంతృప్తస్థాయిలో ఆహార భద్రత' అనే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఇతర జిల్లాలకు సైతం స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన సోషల్ మీడియా ఖాతాలను శనివారం పూర్తిగా మహిళలకే అప్పగించబోతున్నానని ప్రధానమంత్రి స్పష్టంచేశారు.

# ఇంజినీరింగ్ కోర్సుపై అనాసక్తి

### - ఆసక్తి చూపని విద్యార్థులు - తక్కువ ప్లేస్మెంట్ రేటే కారణం

### - ఖాళీగా మిగిలిపోతున్న లక్షలాది సీట్లు : ఏఐసీటీఈ డేటా




దేశంలోని సాంకేతిక రంగంలో ఇంజినీరింగ్ విద్య అనేది చాలా కీలకం. ప్రపంచంతో పోటీ పడే విధంగా దేశ భవిష్యత్తును ఈ కోర్సులు తీర్చి దిద్దుతాయనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అంతేకాదు.. కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎక్కువ జీతాలతో ఉద్యోగాలను పొందేందుకు దారిని కూడా చూపిస్తాయి. అందుకే.. గత కొన్నేండ్ల క్రితం వరకు ఇంజినీరింగ్ కోర్సులకు డిమాండ్ ఎక్కువ. ఈ కోర్సుల్లో చేరటానికే విద్యార్థులు ఆసక్తి చూపేవారు.

న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. విద్యార్థుల ఆలోచన తీరు మారింది. ఒకప్పుడు ఇంజినీరింగ్ కోర్సుల్లో ఎన్రోల్మెంట్ ఎక్కువగా ఉండేది. ప్లేస్మెంట్ రేట్లు కూడా చక్కగానే ఉండేవి. అయితే, భారత్లోని ఇంజినీరింగ్ కాలేజీలలో మాత్రం ఎన్రోల్మెంట్, ప్లేస్మెంట్ రేట్లు తగ్గాయి. ఒకప్పుడు వెలుగువెలిగిన ఇంజి నీరింగ్ కోర్సులు.. ఇప్పుడు వెలవెలబోతున్నాయని విద్యావేత్తలు, నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. భారత్లో టెక్నికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ అయిన ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) సమాచారమూ ఇదే విషయాన్ని వివరిస్తుండటం గమనార్హం. దేశంలో ఇంజినీరింగ్ కోర్సులకు డిమాండ్ తగ్గిందనీ, గత కొన్నేండ్లుగా ఇదే పరిస్థితి ఉన్నదని ఏఐసీటీఈ డేటా వివరిస్తున్నది. ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన వృత్తి విద్యగా ఇంజినీరింగ్ కోర్సుకు మంచి గౌరవం, డిమాండ్ ఉండేది. అయితే, గత కొన్నేండ్లుగా మాత్రం ఈ కోర్సులో చేరేవారి సంఖ్య మాత్రం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా 2019-20 నుంచి 2023-24 మధ్య మూడువేలకు పైగా ప్రభుత్వ అనుబంధ, ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలలో 64 లక్షల సీట్లకు గానూ 45.50 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి. దాదాపు రెండు లక్షల బీటెక్ సీట్లు అంటే 30 శాతం భర్తీ కాకుండా ఖాళీగానే ఉన్నాయి. ఇంజినీరింగ్ కోర్సుల వైపు విద్యార్థులు ఆసక్తి చూపకపోవటానికి గల ప్రధాన కారణం.. తక్కువ ప్లేస్మెంట్లేనని విద్యావేత్తలు, నిపుణులు చెప్తున్నారు. అలాగే, మంచి కెరీర్ను అందించే ఇతర కోర్సులూ అందుబాటులోకి రావటమూ ఈ పరిస్థితికి దారి తీసిందని అంటున్నారు. అంతేకాకుండా, అధిక ఫీజులు, కాలం చెల్లిన పాఠ్యాంశాలు, పలు ప్రయివేటు కాలేజీలలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవటం వంటి అంశాలను ఇతర కారణాలుగా నిపుణులు వివరిస్తున్నారు. ఏఐసీటీఈ మెంబర్ సెక్రెటరీ రాజీవె కుమార్ మాట్లాడుతూ.. ప్రయివేటు ఇన్స్టిట్యూట్లలో సీట్లు తరచూ ఖాళీగా ఉంటాయని అన్నారు. ప్రత్యేకించి గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఉన్న సంస్థల్లో ఈ పరిస్థితి ఉంటుందని చెప్పారు. టైర్2, టైర్ 3 నగరాల్లో ఉపాధి అవకాశాలను కల్పించటం తాము పరిష్కరిస్తున్న సవాళ్లలో ప్రధానమైనదని వివరించారు. దీని ఫలితంగా విద్యార్థులు ఇంజినీరింగ్ అడ్మిషన్ల కోసం పెద్ద నగరాలకు వెళ్లటాన్ని నిరోధిస్తుందని చెప్పారు. ఫలితంగా.. ఈ నగరాల్లో ఉండే ఇంజినీరింగ్ కాలేజీలలోని సీట్లు భర్తీ అవుతాయని వివరించారు. సమస్యను పరిష్కరించటం కోసం.. బీటెక్తో పాటు బీబీఏ, బీసీఏ వంటి అదనపు ప్రోగ్రామ్లను ఆఫర్ చేస్తున్న గ్రామీణ ప్రాంతాల్లోని ఇన్స్టిట్యూషన్లను ప్రోత్సహించటానికి, కోర్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఏఐసీటీఈ స్కాలర్షిప్లను ప్రవేశపెడుతన్నదని రాజీవె కుమార్ చెప్పారు

### తగ్గిన ప్లేస్మెంట్లు

ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్లేస్మెంట్లు సవాల్గా మారాయి. దేశవ్యాప్తంగా 2019-20 నుంచి 2022-23 మధ్య దాదాపు 34.30 లక్షల మంది విద్యార్థులు అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరారు. అయితే, 16.4 లక్షల మందికి, అంటే 47.7 శాతం మంది విద్యార్థులు మాత్రమే ప్లేస్మెంట్లో విజయం సాధించటం గమనించాల్సిన అంశం.


## సోమవారం రైతులతో రేవంత్‌రెడ్డి ముఖాముఖి..

### కలెక్టర్లు ప్రత్యేక ఏర్పాట్లు




**హైదరాబాద్, :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 16న వ్యవసాయ యూనివర్సిటీలో 'రైతు నేస్తం' కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని రైతు నేస్తం కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం నిర్వహించనున్నారు. రైతు నేస్తం కేంద్రాల్లోంచి అన్నదాతలతో రేవంత్‌రెడ్డి ముచ్చటించనున్నారు. ప్రతి ప్రాంతం నుంచి కనీసం 250 మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఎస్.. కలెక్టర్లకు ఆదేశించారు. దీంతో కలెక్టర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది దేశంలోకి ముందుగానే రుతుపవనాలు ప్రవేశించాయి. ప్రస్తుతం తెలంగాణలో ఆయా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పంటలకు సంబంధించి రైతులతో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. ఏఏ పంటలు వేయాలి.. ఎలాంటి ఎరువులు వాడాలి? తదితర అంశాలపై ముచ్చటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## ఇరాన్‌తో సంఘర్షణ..
## భారత్‌కు క్షమాపణ చెప్పిన ఇజ్రాయిల్..




**న్యూఢిల్లీ,:** ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య తీవ్ర సంఘర్షణ జరుగుతోంది. ఇరాన్ అణు కార్యక్రమాలే లక్ష్యంగా శుక్రవారం ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ లోని అతిపెద్ద నగరమైన టెల్ అవీవ్‌ని ఇరాన్ క్షిపణులతో టార్గెట్ చేసింది. అయితే, ఇప్పుడు ఇజ్రాయిల్ పొరపాటున చేసిన పనికి భారతదేశానికి "క్షమాపణలు" చెప్పింది. భారతదేశ పటాన్ని ఇజ్రాయిల్ తప్పుగా చూపించింది. జమ్మూ కాశ్మీర్ ని పాకిస్తాన్‌లో భాగంగా, ఈశాన్య రాష్ట్రాలు నేపాల్‌లో భాగంగా చూపించింది. ఇరాన్ క్షిపణుల పరిధిని వివరించే క్రమంలో ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ భారతదేశ మ్యాప్‌ని తప్పుగా చూపించింది. ఐడిఎఫ్ శుక్రవారం మ్యాప్‌ను పోస్ట్ చేసింది, "ఇరాన్ ప్రపంచ ముప్పు, ఇజ్రాయెల్ అంతిమ లక్ష్యం కాదు, ఇది ప్రారంభం మాత్రమే" అని పేర్కొంది. "మాకు చర్య తీసుకోవడం తప్ప వేరే మార్గం లేదు" అని అది సైనిక దాడిని ప్రస్తావిస్తూ జోడించింది. మ్యాప్‌లో భారతదేశాన్ని కూడా ఇరాన్ క్షిపణి పరిధిలో చేర్చారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న సైనిక వివాదం మధ్య విడుదల చేసిన మ్యాప్‌పై భారతదేశం నుండి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సోషల్ మీడియాలో ఇజ్రాయిల్ తీరుపై నెటిజన్లు మండిపడ్డారు. అయితే, ఈ తప్పుపై ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) క్షమాపణలు తెలిపింది. ఈ మ్యాప్ సరిహద్దులను ఖచ్చితంగా వర్ణించడంలో విఫలమైందని, ఈ చిత్రం వల్ల జరిగిన ఏదైనా నేరానికి మేము క్షమాపణలు కోరుతున్నాము అని చెప్పింది. ఇజ్రాయిల్ పోస్ట్ చేసిన మ్యాప్ ప్రకారం, భారత్, రష్యా, చైనా సహా 15 దేశాలు ఇరాన్ క్షిపణి పరిధిలోకి వస్తున్నాయి.

## 'సురక్షిత ప్రాంతాలకు తరలించండి'..
## ఏది సురక్షితమో చెప్పలేం..!



ఇజ్రాయిల్ నిన్న(శుక్రవారం) చేసిన దాడుల తర్వాత ఇరాన్‌లో ఉంటున్న భారతీయ విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఒక్కసారిగా ఇజ్రాయిల్ విరుచుకుపడటంతో ఇరాన్‌లో భారీ నష్టమే వాటిల్లింది. ప్రపంచ దేశాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ మెరుపు దాడులు చేసింది. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' ప్రారంభించిన తర్వాత ఇరాన్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. భీకర దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ సహా పలువురు కీలక వ్యక్తులు మరణించారు. అయితే దీనికి ప్రతిగా ఇజ్రాయిల్‌పై ఈరోజు(శనివారం) ఇరాన్ మెరుపు దాడులు చేసింది. ఇరాన్ చేసిన క్షిపణి దాడులతో ఇజ్రాయిల్‌లో సైతం భారీ నష్టమే వాటిల్లినట్లే తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య దాడులు తీవ్రతరం కావడంతో ఇరాన్‌లో ఉన్న భారత విద్యార్థులు వణికిపోతున్నారు. ఏ సమయంలో ఏ ముప్పు ముంచుకొస్తుందో అనే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఇరాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటూ వేడుకుంటున్నారు. అధికారులు మాత్రం ప్రస్తుతం ఇక్కడ అంతా బాగానే ఉందని, మీరంతా సురక్షితంగా ఉన్నారనే భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ భారత విద్యార్థులు మాత్రం ఈ దాడులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని, తమకు ఒకానొక సమయంలో భారీగా భూమి కంపించినట్లు అనిపించిందని, సురక్షిత ప్రాంతాలకు తరలించే యత్నం చేయాలని విన్నవిస్తున్నారు. ఈ యుద్ధ సమయంలో ఏది సురక్షిత ప్రాంతమనేది కూడా ఆ యూనివర్శిటీ అధికారులు చెప్పలేకపోతున్నారు. తమకు ఫలానా ప్రాంతం సురక్షితమైనదనే సమాచారం ఏదీ లేదని, మీరు దయచేసి సంయమనం పాటించాలని అంటున్నారు. 'మనమంతా సేఫ్ ప్లేస్‌లో ఉన్నాం. దయచేసి మీరు కామ్‌గా ఉండండి' అంటూ టెహ్రాన్ యూనివర్శిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టీయూఎంఎస్) అధికారులు చెప్పినట్లు కశ్మీర్ నుంచి వెళ్లి అక్కడ ఎంబీబీఎస్ రెండో ఏడాది చదువుతున్న తబియా జహ్రా పేర్కొన్నారు. ఉత్తర్ ప్రదేశ్ నుంచి వెళ్లిన అలిషా రిజ్వీ మాట్లాడుతూ.. 'ప్రస్తుతం మా డేటాను అధికారులు సేకరిస్తున్నారు. మా ఈ మెయిల్ అడ్రస్, ఫోన్ నంబర్లు తీసుకుంటున్నారు. ఒకవేళ మమ్మల్ని తరలించే అవసరం ఏర్పడితే అందుకు ముందుస్తు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నారు' ని ఆమె పేర్కొన్నారు. వీరిద్దరి 5.5 ఎంబీఎస్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇరాన్‌లోని టెహ్రాన్‌కు 2023లో రాగా, ఇప్పటికి రెండేళ్లు పూర్తి చేసుకున్నారు. ఇదే తరహాలో చాలామంది విద్యార్థులు ఇరాన్‌లోని ప్రస్తుత పరిస్థితుల నడుమ భయాందోళనలతో ఉన్నారు. ఇదిలా ఉంచితే, జమ్మూ కశ్మీర్ విద్యార్థి సంఘం.. భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌ను కలిసింది. భారత స్టూడెంట్లు అక్కడ ప్రస్తుత భయానక పరిస్థితుల్లో ఉన్నారని, వారికి పదేపదే యుద్ధ సైరన్లు వినిపించడంతో వారు బెంబేలెత్తిపోతున్నారని జై శంకర్‌కు సదరు అసోసియేషన్ పెద్దలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు భారత ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇరాన్‌లో చదువుతున్న తమ పిల్లల కోసం తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారని స్టూడెంట్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. మరొకవైపు ఇరాన్‌లోని భారతీయుల కోసం అక్కడి భారత రాయబార కార్యాలయం కీలక సూచనలు చేసింది. భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే బయటకు రావాలని అడ్వైజరీలో పేర్కొంది. అయితే ఇప్పుడు తాము ఉన్న ప్రదేశంలో ఉండలేకపోతున్నామనే ఆందోళన భారత విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది.

## శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర.. ఇస్రో కీలక ప్రకటన

ఢిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసియాత్ర ఇస్రో కొత్త తేదీని ప్రకటించింది. జూన్ 19వ తేదీన శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర చేపట్టనున్నారు. యాక్సియం-4 మిషన్ కింద మరో ముగ్గురు ఆస్ట్రోనాట్లతో కలిసి ఆయన నింగిలోకి వెళ్లనున్నారు. అయితే, తొలుత మే 29న ప్రయోగం జరగాల్సి ఉండగా.. సాంకేతిక సమస్యలతో పలుమార్లు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తాజాగా ఇస్రో కొత్త తేదీని ప్రకటించింది. ఇదిలా ఉండగా.. అంతకుముందు శుభాంశు శుక్లా రోదసియాత్ర వాయిదా పడిన విషయం తెలిసిందే. సాంకేతిక సమస్యతో యాత్రను వాయిదా వేస్తున్నట్లు స్పేస్‌ఎక్స్ తెలిపింది. రాకెట్‌లో లిక్విడ్ ఆక్సిజన్ లీక్ కారణంగా ప్రయోగం వాయిదా పడినట్లు 'ఎక్స్'లో పేర్కొంది. మరమ్మతులకు సమయం పడుతుందని.. త్వరలోనే కొత్త లాంచ్ తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. ప్రయోగ వాయిదా విషయాన్ని భారత రోదసి పరిశోధన సంస్థ (ఇస్రో) కూడా ధ్రువీకరించింది. ప్రయోగానికి ముందు బూస్టర్ టెస్టును తనిఖీ చేస్తుండగా ఈ సమస్యను గుర్తించినట్లు తెలిపింది. తొలుత లీక్ సమస్యను పరిష్కరించి పరీక్షించిన తర్వాత ప్రయోగం నిర్వహించాలని శాస్త్రవేత్తలు తేల్చారు. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్' ఈ మిషన్ నిర్వహిస్తోంది. ఇస్రో, అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా), ఐరోపా అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ)లు ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నాయి. ఈ స్పేస్ క్యాప్సూల్‌ను ఫాల్కన్-9 రాకెట్ నింగిలోకి మోసుకెళుతోంది. ఇందులో శుభాంశు మిషన్ పైలట్ బాధ్యతలు నిర్వహిస్తారు.

## టేకాఫ్ అవగానే మూగబోయి ఉంటాయి: నిపుణులు

### ఇంజన్ వైఫల్యమే!
### మేడే కాల్, వీడియోల్లో ఇంజన్ శబ్దమే విన్పించలేదు
### రెండు ఇంజన్లు విఫలమవడం అత్యంత అసాధారణం
### టేకాఫ్ సెట్టింగుల్లో లోపం, పైలట్ తప్పిదమే కారణం?



దేశాన్ని దిగ్భ్రాంతికి లోను చేసిన ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ (వీటీ-ఏఎన్‌బీ) 171 విమాన ప్రమాదానికి ఇంజన్ వైఫల్యమే కారణమై ఉంటుందని వైమానిక రంగ నిపుణులు అనుమానిస్తున్నారు. ఎందుకంటే పెను ప్రమాదాన్ని సూచిస్తూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు పైలట్ చేసిన మేడే కాల్‌లోనూ, ప్రమాద వీడియోల్లోనూ విమానం ఇంజన్ శబ్దం అసలు విన్పించమే లేదు. దాన్నిబట్టి విమానం అప్పటికే పూర్తిగా థ్రస్ట్ (ఎగిరేందుకు అవసరమైన వేగం) పూర్తిగా కోల్పోయిందని విశ్లేషిస్తున్నారు. పక్షులు ఢీకొట్టడం వంటివి ఇందుకు కారణం కావచ్చంటున్నారు. అహ్మదాబాద్ విమానాశ్రయంలో పక్షుల బెడద ఎక్కువే. అయితే బోయింగ్‌లో అత్యాధునికమైన ఈ శ్రేణి విమానాల్లో రెండు అత్యంత శక్తిమంతమైన ఇంజన్లుంటాయి. ఒకటి అనుకోకుండా ఫెయిలైనా రెండో ఇంజన్ సాయంతో విమానం సునాయాసంగా ఎగరగలదు. దాన్ని బట్టి రెండు ఇంజన్లూ విఫలమై ఉంటాయని అనుకోవాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. కానీ 10 లక్షల ప్రయాణాలకు కేవలం ఒకసారి మాత్రమే అలా జరిగే ఆస్కారముంటుంది! ఇంధన కల్తీ, యాంత్రిక వైఫల్యం వల్ల కూడా ఇలాంటి పరిస్థితి తలెత్తవచ్చు. కానీ బోయింగ్ 787లో వాడేది అత్యంత శక్తిమంతమైన జనరల్ మోటార్స్ కంపెనీ తాలూకు జీఈఎన్‌ఎక్స్ ఇంజన్లు. అవి అత్యంత విశ్వసనీయమైనవి. ఈ నేపథ్యంలో ప్రమాద కారణం పెద్ద పజిల్‌గా మారింది. బ్లాక్‌బాక్స్ డేటాను పూర్తిగా విశ్లేషించిన మీదటే దీనిపై స్పష్టత వస్తుందని నిపుణులు అంటున్నారు. వారి విశ్లేషణ ప్రకారం ప్రమాద కారణాలు ఏమై ఉండొచ్చంటే...

### టేకాఫ్ సెట్టింగుల్లో లోపం

విమానం టేకాఫ్ కాగానే లాండింగ్ గేర్ మూసుకోవాలి. సురక్షితమైన ఎత్తుకు చేరేదాకా రెండు ఫ్లాప్‌లూ (రెక్కల వెనక భాగం) విచ్చుకుని ఉండాలి. అప్పుడే విమానానికి ఎగిరేందుకు అవసరమైన శక్తి, ఊపు లభిస్తాయి. వీటన్నింటినీ టేకాఫ్ సెట్టింగులుగా పిలుస్తారు. ఇకగురువారం మధ్యాహ్నం ప్రమాద సమయంలో అహ్మదాబాద్‌లో ఏకంగా 43 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. దాంతో వాయుసాంద్రత తక్కువగా ఉంది. అలాంటప్పుడు లాండింగ్ గేర్, ఫ్లాప్‌లు అత్యంత కచ్చితత్వంతో పని చేయడం చాలా కీలకం. కానీ ఏఐ171 విమానం గేర్ తెరుచుకునే ఉండగా ఫ్లాప్‌లు మూసుకుపోయాయి. ఇది పెను ప్రమాదానికి దారితీసే అసాధారణ పరిస్థితి. దీనివల్ల పైకెగిరేందుకు కావాల్సిన శక్తి సమకూరక విమానం అదుపు తప్పుతుంది. పైగా అవసరమైన థ్రస్ట్ లభించకుండానే పైలట్ టేకాఫ్‌కు ప్రయత్నించి ఉంటాడంటున్నారు. ఇలా ఫ్లాప్‌లు వెంటనే ముడుచుకుపోవడం వల్లే 2008లో స్పాన్‌ఎయిర్ విమానం కుప్పకూలింది.

### సరిపోని థ్రస్ట్

బోయింగ్ ఇంజన్లు శక్తిమంతమైనవే అయినా విమానం బరువు, రన్‌వే పొడవు, ఉష్ణోగ్రత తదితరాల ఆధారంగా టేకాఫ్‌కు నిర్దిష్ట థ్రస్ట్ సెటింగ్‌లు అవసరమవుతాయి. 43 డిగ్రీల ఎండ ఉన్నందున ఇంజన్ సామర్థ్యం సహజంగానే కాస్త తగ్గుతుంది. అలాంటప్పుడు టేకాఫ్‌కు మామూలు కంటే అధిక థ్రస్ట్ తప్పనిసరి. కానీ ఏఐ171 పైలట్ రొటేషన్ స్పీడ్‌ను పొరపాటుగా లెక్కించి తక్కువ థ్రస్ట్ ప్రయోగించి ఉండొచ్చు. 241 మంది ప్రయాణికులు, భారీ లగేజీ, ఏకంగా 1.25 లక్షల లీటర్ల ఇంధన బరువు దీనికి తోడై విమానం సజావుగా ఎగరలేకపోయి ఉంటుంది.

### లాండింగ్ గేర్ వైఫల్యం

ప్రమాద సమయంలో ఏఐ171 విమానం లాండింగ్ గేర్ తెరుచుకునే ఉంది. ఇది డ్రాగ్‌కు దారితీస్తుంది. దాంతో విమానం సజావుగా ఎగరలేదు. అందుకే టేకాఫ్ అయ్యాక క్షణాల్లోనే గేర్ మూసుకోవాల్సి ఉంటుంది. కానీ తొలుత దాదాపుగా మూసుకున్న ఏఐ171 లాండింగ్ గేర్ ఆ వెంటనే బయటికొస్తూ కన్పించింది. బహుశా విమానాన్ని పైకి తీసుకెళ్లేందుకు అవసరమైన థ్రస్ట్ లభించడం లేదని అర్థమై ఎమర్జెన్సీ లాండింగ్‌కు వీలుగా పైలట్ ఉద్దేశపూర్వకంగానే అలా చేసి ఉండొచ్చని భావిస్తున్నారు. మొత్తం ఉదంతంలో ఏదో ఒక దశలో పైలట్ లోపం కచ్చితంగా ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ఇలాంటి లోపాలను సునాయాసంగా అధిగమించే అత్యాధునిక సాంకేతికత 787 సొంతం. ఇక్కడే పైలట్ మానవ తప్పిదం చోటుచేసుకుని ఉంటుందంటున్నారు.

### విద్రోహ కోణంకంగానే వి

ఉగ్రవాదులో, దేశ వ్యతిరేక శక్తులో ఉద్దేశపూర్వమానాన్ని కూల్చేయడం. కానీ ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న సమాచారం,సాక్ష్యాలను బట్టి ఇందుకు అవకాశాలు తక్కువే.

## ఇజ్రాయెల్ బాధ్యతారాహిత్యం



గాజాలో నరమేధం కొనసాగిస్తూనే పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ మరో కుంపటి రాజేసింది. ఎలాంటి కవ్వింపూ లేకుండానే శుక్రవారం ఇరాన్‌పై దాడులకు దిగి రాజధాని తెహ్రాన్‌తో సహా అనేకచోట్ల బాంబుల వర్షం కురిపించింది. 200 యుద్ధ విమానాలు ఏకబిగిన సాగించిన ఈ దాడుల్లో ఇరాన్ సైన్యంలో కీలక పాత్ర పోషిస్తున్న సైనిక దళాల చీఫ్, ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కమాండర్, ఇరాన్ ఎమర్జెన్సీ కమాండ్ చీఫ్‌ల ప్రాణాలు తీయటంతో పాటు అణు కార్యక్రమంలో చురుగ్గా ఉంటున్న ఆరుగురు శాస్త్రవేత్తలను హతమార్చింది. ఇరాన్ అణు స్థావరాలను కూడా లక్ష్యం చేసుకున్నట్టు సమాచారం. ఆ దేశంపై తమ యుద్ధం ఆగదని కూడా ఇజ్రాయెల్ ప్రకటించింది. ప్రతీకారంగా ఇరాన్ వంద డ్రోన్‌లతో సాగించిన దాడి పెద్దగా ఫలించిన వైనం కనబడట్లేదు. అమె రికా అధ్యక్ష ఎన్నికలప్పుడూ, అధికారం స్వీకరించాకా ట్రంప్ ఇరాన్‌తో అణు ఒప్పందం గురించి పదేపదే ప్రకటనలు చేశారు. కానీ ఇజ్రాయెల్ దుందుడుకు చర్య చూస్తుంటే ఆ ప్రకటనల్లోని నిజా యతీ ప్రశ్నార్థకమైంది. ఎందుకంటే అమెరికా లోపాయకారీ అనుమతి లేకుండా ఆ దేశం ఇలాంటి దాడులకు తెగించే అవకాశం లేదు. తాజా దాడుల్ని ఖండించకపోగా ఒప్పందం కోసం వస్తున్న అవకాశాలను ఇరాన్ కాలదన్నుకుంటున్నదని, ఇదే కొనసాగితే పరిస్థితి విషమం కావొచ్చని శుక్ర వారం ఆ దేశాన్ని ట్రంప్ హెచ్చరించిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తుంది. నిజాయతీ ఉంటే అణు ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగా ఈ దాడులేమిటని ఇజ్రాయెల్‌ను నిలదీసి ఉండాలి. చర్చలే అణు ఒప్పందానికి సంబంధించినవైనప్పుడు ఇరాన్ అణు శాస్త్రవేత్తల్ని హత్య చేయటం నేరపూరితమని చెప్పివుండాలి. ఆ పని చేయకపోగా ఇజ్రాయెల్ దాడుల్లో తమ ప్రమేయం లేదని, కనుక పశ్చిమాసియాలోని అమెరికన్ స్థావరాలపై ప్రతీకార దాడులకు దిగొద్దని ఇరాన్‌ను హెచ్చరించింది. ఇరాన్‌తో అణు ఒప్పందం గురించి తన దూతల ద్వారా చర్చలు మొదలెట్టాక వాటిని భగ్నం చేసే చర్యకు పాల్పడవద్దని ఆ మధ్య ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచించారు. అయితే అమెరికా విధిస్తున్న షరతులు తమకు సమ్మతం కాదని మూడు రోజుల క్రితం ఇరాన్ ప్రకటించాక పరిస్థితి మారింది. వాస్తవానికి వచ్చే ఆదివారం అమెరికా-ఇరాన్‌ల మధ్య మరో దఫా చర్చలు జరగాల్సి ఉంది. తాజా దాడుల తర్వాత వాటిని నిలిపివేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అణుబాంబు వైపుగా అడుగులేస్తున్నదని ఇరాన్‌పై ఆరోపణలు చేసేవారు ఏ కవ్వింపూ లేకుండానే ఇజ్రాయెల్ దాడులు చేయటాన్ని ఏ రకంగా సమర్థిస్తారు? ఈ దాడులకు 24 గంటల ముందు పశ్చిమాసియా దేశాల్లోని తమ సైనికాధికారుల కుటుంబాలు వెనక్కి వచ్చేయాలంటూ పిలుపునివ్వటం, ఇరాక్ నుంచి దౌత్య వేత్తల్ని కూడా వెనుదిరగమని అమెరికా చెప్పటం గమనార్హం. వాస్తవానికి గత కొన్ని నెలలుగా ఇజ్రాయెల్‌కు విమానాలూ, క్షిపణులూ, ఇతర ఆయుధాలు పంపిస్తూ తాజా దాడులకు అమెరికాయే పూర్వరంగాన్ని సిద్ధం చేసిందా అనే అనుమానం కలుగుతోంది. అసలే ప్రపంచం పలు సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. కరోనా మహమ్మారి కాటేయటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ తీవ్రంగా దెబ్బతిని ఉన్నాయి. అయిదేళ్లు కావస్తున్నా ఏ దేశమూ పూర్తిగా కోలుకున్న దాఖలా కనబడటం లేదు. అంతక్రితమే 1991లో కువైట్‌పై ఇరాక్ సాగించిన యుద్ధం మొదలుకొని ఇరాన్, సౌదీ అరేబియాల మధ్య టర్కీ, సిరియాల మధ్య తీవ్ర ఘర్షణలు సాగాయి. ఉగ్రవాదాన్ని అంతమొందించే పేరిట ఇరాక్‌పై అమెరికా, పాశ్చాత్య దేశాలు కొనసాగించిన యుద్ధం, లిబియాలో కల్లోలం సృష్టించి గడాఫీని అంతం చేయటం వంటి పరిణామాల నుంచి పశ్చిమాసియా ఇంకా కోలుకోలేదు. అక్కడ చాలా దేశాల్లో సాయుధ ముఠాలు పరస్పరం తలపడు తున్నాయి. ఇజ్రాయెల్-పాలస్తీనా వైరం సరేసరి. ఉక్రెయిన్‌తో యుద్ధానికి దిగిన రష్యా బయట కొచ్చే మార్గం తెలియక కొట్టుమిట్టాడుతోంది. దాన్నుంచి సాయం అందే దారులు మూసుకు పోవటంతో సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ మిలిటెంట్ల దాడుల తర్వాత దేశం విడిచి పరార య్యారు. ఇప్పుడక్కడ అమెరికా మద్దతుతో ఒకప్పటి అంతర్జాతీయ ఉగ్రవాది మహమ్మద్ అల్- షారా దేశాధ్యక్షుడయ్యాడు. సరిగ్గా నెలరోజుల క్రితం గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) సదస్సుకెళ్లిన ట్రంప్ ఆయనపై పొగడ్తల వర్షం కురిపించారు. ఇలా పశ్చిమాసియా రకరకాల క్లేశాలతో ఇప్పటికీ నెత్తురోడుతూ ఉండగా దాన్ని మరింత ఊబిలోకి నెట్టేలా తాజా పరిణామాలున్నాయి. ఇరాన్‌పై దాడి జరిగితే తాము మౌనంగా ఉండ బోమని ఆ మధ్య రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. అదే జరిగితే ఇజ్రాయెల్ తరఫున అమెరికా నేరుగా రంగంలోకి దిగుతుంది. సారాంశంలో ఇజ్రాయెల్ దుందుడుకు చేష్టలు, అమెరికా గుడ్లప్పగించి చూడటం ఒక్క పశ్చిమాసియాను మాత్రమే కాదు... ప్రపంచాన్నే యుద్ధం అంచుల్లోకి నెడుతున్నాయి. తాను అధికారంలోకొచ్చాక ఇరాన్‌తో 46 ఏళ్లుగా కొనసాగుతున్న వైరానికి స్వస్తి పలుకుతానని, ప్రపంచంలో ఏ మూలనా అమెరికా సైన్యం ఉండాల్సిన అవసరం లేకుండా చేస్తానని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటలు ట్రంప్ మరిచారా? ఈ యుద్ధం కొనసాగితే తక్షణం హోర్మూజ్ జలసంధి మూతబడి ప్రపంచ దేశాలకు పోయే 25 శాతం ముడిచమురు, సహజ వాయు రవాణా నిలిచిపోతుంది. పర్యవసానంగా అంతంతమాత్రంగా ఉన్న ఆర్థిక వ్యవస్థలుమరింత కుంగుతాయి. ఇక అమెరికా, రష్యా, చైనాలు నేరుగా దిగితే జరిగే పరిణామాలు ఊహకందని ఉత్పాతాన్ని సృష్టిస్తాయి. అగ్రరాజ్యాలు... ముఖ్యంగా అమెరికా తమ మూర?త్వాన్ని విడనాడి ఇజ్రాయెల్‌ను దారికి తేవాలి. లేనట్టయితే భవిష్యత్తరాలు క్షమించవు.

## వారిని క్లీన్ బౌల్డ్ చేయండి




ఐపీఎల్ సీజన్ ముగిసినా క్రికెట్ భాషే తేలిగ్గా అర్థమౌతుందనే ఈ 'క్లీన్ బౌల్డ్' అనే మాట వాడటం. ఇంతకీ విషయమేమిటంటే.. "కేసీఆర్ ఒక చరిత్ర! ఆయన్నంటే తెలంగాణను అన్నట్టే! ప్రపంచాద్భుతాన్ని, అన్నీ తానై సృష్టిస్తే దాన్లో ఒక్క పిల్లర్ కుంగితే ఇంత హంగామా చేస్తారా!" అంటాడు పుత్రరత్నం! "రేవంత్‌పై కేటీఆర్ అవాకులూ, చెవాకులూ పేలితే చెమ్డాలు వలుస్తా"మంటాడు మాజీ విద్యార్థి నాయకుడైన ఒక శాసనసభ్యుడు. ఈ రెండు పిల్లుల తగాదాలో తెలంగాణ రొట్టె ముక్క తన నోట్లో పడొచ్చన్న ఆశతో "కాళేశ్వరంపై ఇంతలొల్లి ఎందుకు? సీబీఐకిచ్చేయమనండి, ఒక పనైపోతుంది" అంటూ "ఆయన్ని చూశారు, ఈయన్ని చూస్తున్నారు. ఈసారి మాకొక ఛాన్సిచ్చి చూడండి! డబల్ ఇంజన్ ధమాకా ఎలా ఉంటుందో చూపిస్తాం" అంటాడు ఓ కాషాయనేత. ఈ మూడు స్తంభాలాటలో అధికారమే నాలుగో స్తంభం. వచ్చినదాన్ని నిలబెట్టుకోవడానికి ఒకరి తాపత్రయం. పోయినదాన్ని పారేసుకున్న చోటే వెతుక్కోవడానికి మరొకరి ఆరాటం. నయానో, భయానో కొందరినైనా లొంగదీసుకుని అధికారాన్ని లాక్కోవడానికి ఇంకొకరి ప్రయత్నం. ఈ మధ్యలో 'మిస్' అవుతున్నది ప్రజలు, ప్రజాసమస్యలు. నీరు పల్లమెరుగుననే విషయం చిన్న పిల్లోడికి సైతం తెలుసు. దేశంలో అమలు జరిగే విధానాలు మాత్రం కేంద్ర ప్రభుత్వం నుండి కిందికి పాకుతాయనే విషయం విడమరిచి చెప్తేనే జనానికి అర్థమవుతుంది. ప్రభుత్వరంగాన్ని మూసేయడం (హెచ్‌ఎంటి, హెచ్ఇసి, ఐడీపీఎల్‌లాగా) ప్రయివేటీకరించడం (బాల్కో, హిందుస్థాన్ జింక్ లాగా) ఉధృతంగా సాగుతున్నాయి బీజేపీ హయాంలో. విద్యుత్, రవాణా, విద్య, వైద్యం వంటి సేవా రంగాలన్నీ ప్రయివేటు వారి చేతిలో పెట్టేందుకు ప్రతి బడ్జెట్‌ను సాధనం చేసుకుంటోంది కేంద్ర సర్కార్. ఉదాహరణకు రైల్వేపై ఒకేసారి ప్రయి'వేటు'వేయకుండా స్టేషన్లను, సిగలింగ్ వ్యవస్థను, ట్రాక్ మెయిన్టెనెన్స్‌ను, రోలింగ్ స్టాక్ (ఇంజన్లు, బోగీల) తయారీ, మెయిన్టెనెన్స్‌ను, చివరికి రైల్వే పోలీసుల (ఆర్‌పీఎఫ్)ను సైతం ప్రయివేటుకివ్వడం నేడు చూస్తున్నాం. యాక్సిడెంట్లు జరిగినపుడు మంత్రుల మొసలి కన్నీరు, అధికారగణం ఎవరో ఒకర్ని బలిపశువుల్ని చేయడం తప్ప మరేముంది. మొన్నటికి మొన్న జరిగిన ఎయిరిండియా ప్రమాదంలో ఓవర్‌లోడ్ (లగేజ్) చేయడం కూడా ఒక కారణంగా బయటికొస్తోంది. 250 మంది ప్రాణాలు పోయిన తర్వాత ఏం గుణపాఠాలు తీస్తే ఏం ప్రయోజనం? ఈ విధానాల ప్రభావం అన్ని రాష్ట్రాల్లో కనపడుతోంది. కాంగ్రెస్ పాలనలో ఉపాధి శూన్యమన్నారు మోడీ. మేకిన్ ఇండియా, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియాలు దేశంలో ఉపాధిని పెంచలేదు. దాంతో మోడీ తెగించి పకోడీలు చేసుకోవడం కూడా ఉపాధే కదా అంటూ దావోస్‌లో చెప్పారు. మేక్ ఇన్ ఇండియా నినాదం కంటే ముందు నర్మదా తీరంలో పెట్టిన సర్దార్ పటేల్ విగ్రహంగాని, ఆ తర్వాత తయారైన మన షాద్‌నగర్‌లోని రామానుజాచార్యుల విగ్రహంగాని చైనాలోనే రూపొందాయి. మరి ఇండియాలో ఉద్యోగాలెలా వస్తాయి మోడీజీ? గత 50 ఏండ్లలో లేనంత నిరుద్యోగం నేడుందని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి. అతి పెద్ద ఉపాధి క్షేత్రమైన వ్యవసాయం, దాని తర్వాతి స్థానంలో ఉన్న ఎంఎస్ఎంఈలు నేడు కుదేలైనాయి. వ్యవసాయ జీడీపీ తగ్గడమే కాదు 2011 జనాభా లెక్కల ప్రకారం వ్యవసాయంపై ఆధారపడిన జనాభా 54.6శాతం నుండి తాజాగా 46.1శాతంకు చేరింది. దేశంలో ఆహార భద్రతను ఫణంగా పెట్టి ఇథనాల్ తయారీ కోసం మోడీ సర్కార్ చట్టాలన్నింటినీ చుట్టేసి అనుమతులిస్తున్న తీరు ఆశ్చర్యమే కదా మరి! కనీసం గ్రామ సభ ఆమోదముండాలన్న రూల్‌ను కూడా మడిచి గూట్లో పెట్టారు. అనేక సరుకులపై జీఎస్టీ తగ్గించాలని చివరికి రాష్ట్ర ప్రభుత్వాలు సైతం అడుగుతున్నా తల అడ్డంగా తిప్పుతున్న మోడీ సర్కార్ ఇథనాల్‌పై జీఎస్టీ 18 నుండి 5 శాతానికి తగ్గించడం వెనకెవరున్నారు? 2025 నాటికి ప్రతి లీటర్ పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ ఉండాలన్న రూల్‌గానీ, ఆహారధాన్యాలతో ఇథనాల తయారీగానీ దేశంలో ఆహార భద్రత ప్రమాదంలో పడటానికి కారణం కాదా!? బీఆర్ఎస్ ఒక ప్రాంతీయ పార్టీ కాబట్టి 2018 వరకు బీజేపీతో అంటకాగిందంటే అర్థం చేసుకోవచ్చు. కాని దేశంలో కాంగ్రెస్, బీజేపీతో ఢ అంటే ఢ అంటున్నట్టు చెప్పుకుంటున్న వారు కూడా అలాగే చేయదలచుకున్నారా? మొదట మోడీని 'పెద్దన్నా' అని సంబోధిండం, నేడు బండారు దత్తాత్రేయని 'అజాత శత్రువ'ంటూ కితాబివ్వడమే కాదు.. తాను 'బీజేపీ స్కూల్లో చదువుకున్నానని, టీడీపీ కాలేజీలో ప్యాసై, రాహుల్‌గాంధీ దగ్గర ఉద్యోగం చేస్తున్నా'నని మన ప్రభుత్వ పెద్దలు చెప్పుకోవటం ద్వారా కనీసం కాంగ్రెస్ కార్యకర్తలకు ఏమి సందేశం పంపదల్చుకున్నారు? పీవీ నర్సింహారావును మోడీ, కేసీఆర్ ఇద్దరూ ఆకాశానికెత్తడం దేనికి సూచన? వీరికి ఆ వ్యక్తులకంటే వారి విధానాలే ముఖ్యం అది చెప్పకుండా వ్యక్తుల చుట్టూ రాజకీయాల్ని తిప్పుతూ సంసారం నెట్టుకొస్తున్నారు. ఇటువంటి విధానాలు అవలంభించే వారిని క్లీన్‌బౌల్డ్ చేసి, ప్రజా సమస్యల్ని ప్రధాన ఎజెండాగా చెయ్యాలి.

# పాపం పక్షులు! వేసవిలో వాటిని కాపాడదామా?
## ఈ చిన్న చిన్న పనులు చాలు వాటి ప్రాణాలు నిలబెట్టడానికి!









వేసవి రాగానే వాతావరణం మారిపోతుంది. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో చెట్లు, నీటి వనరులు ఎండిపోతాయి. ఈ కారణంగా నగరాల్లో తిరిగే పక్షులకు నీరు దొరక్క ఇబ్బందులు ఎదుర్కొంటాయి. ఇటువంటి ఆపద్కాలంలో పక్షులకు సాయం చేయాలనుకుంటే, పరిశుభ్రమైన నీరు, ఆహారం, సురక్షితమైన ఆశ్రయం కల్పించండి. వీటి కోసం ఏదో పెద్ద పనులేం చేయాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న పనులు చేయడం ద్వారా వాటి ప్రాణాలను కాపాడిన వారవుతారు. వాటి కోసం మీరు కేటాయించే ఐదు నిమిషాల సమయం మనశ్శాంతిని కలిగిస్తుంది. ప్రకృతిని కాపాడటంలో మీరు కూడా భాగస్వాములవ్వాలని అనుకుంటే, రండి. ఇవి తెలుసుకోండి.

వేసవిలో పక్షులకు ఆహారం ఎందుకు ఇవ్వాలి?

అధిక ఉష్ణోగ్రతలు: వేడి వాతావరణం కారణంగా చెట్లు ఎండిపోతాయి. వేసవి తాపానికి పక్షులకు దాహం వేసి నీటి కోసం వెదుక్కుంటాయి.

పరిమిత నీటి వనరులు: చెరువులు, కుంటలు ఎండిపోవడంతో నీటి లభ్యత కష్టమవుతోంది.

ఆహారం లేకపోవడం: వ్తాతవరణంలో వేడి పెరగడంతో కీటకాలు, విత్తనాలు, పండ్ల లభ్యత తగ్గిపోతుంది.

వేసవిలో పక్షులకు ఆహారం ఎలా ఇవ్వాలి?

శుభ్రమైన నీటిని అందించండి. దీని కోసం ఒక గిన్నెలో మంచినీరు ఉంచి నీడ ఉన్న ప్రదేశంలో ఉంచండి. దోమల సంతానోత్పత్తిని నిరోధించడానికి ప్రతిరోజూ నీటిని మార్చండి. పక్షులు తాగేటప్పుడు, సురక్షితంగా కూర్చోవడానికి చిన్న రాళ్ళు లేదా గులకరాళ్లను అక్కడ ఉంచండి. వేసవి వాతావరణానికి అనుకూలంగా ఉండే ఆహార విత్తనాలు, తృణధాన్యాలు ఇవ్వండి. రాగులు, పొద్దుతిరుగుడు విత్తనాలు, వరి ధాన్యం మంచి ఎంపికలు.

ఇంకా ఏమేం ఇవ్వొచ్చంటే..

పండ్లు: తరిగిన అరటిపండ్లు, బొప్పాయిలు, పుచ్చకాయలు, యాపిల్ పండ్లు పక్షులను ఆకర్షిస్తాయి.

నానబెట్టిన ధాన్యాలు: బియ్యం, గోధుమలు లేదా పప్పుధాన్యాలను నీటిలో నానబెడితే పక్షులు తినడానికి అనుకూలంగా ఉంటాయి.

ఉడికించిన అన్నం లేదా చపాతీ ముక్కలు: తక్కువ పరిమాణంలో అందించండి, ఉప్పగా లేదా జిడ్డుగల ఆహారాన్ని నివారించండి.

సురక్షితమైన ఆహారాన్ని వడ్డించే ప్రదేశాన్ని ఎంచుకోండి. ఫీడర్లు, నీటి గిన్నెలను ప్రత్యక్ష సూర్యరశ్మికి దూరంగా నీడ, నిశ్శబ్ద ప్రాంతాలలో ఉంచండి. వాటిని పిల్లులు, కుక్కలకు దూరంగా ఉంచండి. బాల్కనీలు, మిద్దెలు లేదా వేలాడే ఫీడర్లు లేదా ట్రే ఫీడర్లను ఉపయోగించండి. ఫీడింగ్ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచండి బ్యాక్టీరియాను నిరోధించడం కొరకు వాటర్ బౌల్స్, ఫీడర్ లను క్రమం తప్పకుండా కడగాలి. కీటకాలను ఆకర్షించకుండా ఉండటానికి మిగిలిపోయిన ఆహారాన్ని తొలగించండి.

ఏ పక్షులకు ఎలాంటి ఆహారం ఇవ్వొచ్చు:

పిచ్చుకలు: రాగులు, పొద్దుతిరుగుడు విత్తనాలు, చిరుధాన్యాలు ఇష్టపడతాయి.

చిలుకలు: అరటి, జామ, బొప్పాయి వంటి పండ్లు వంటివి.

కాకులు, కోకిలలు: వండిన అన్నం, చపాతీలు, మృదువైన పండ్లను ఆస్వాదిస్తాయి.


పక్షులకు దూరంగా ఉంచాల్సినవి:

ఉప్పు లేదా కారంగా ఉండే ఆహారం - పక్షుల జీర్ణక్రియకు హానికరం.

రొట్టె, ప్రాసెస్ చేసిన ఆహారం - ఎటువంటి పోషణను అందించదు, ఉబ్బరానికి దారితీస్తుంది.

పాలు - పక్షులు పాలను సరిగా జీర్ణించుకోలేవు.

మిగిలిపోయిన ఆహారం - పక్షులకు హాని కలిగించే నూనెను, ఫ్రిజ్‌లో ఉంచిన పాత ఆహారాన్ని ఇవ్వకపోవడమే మంచిది. అలాగే ఫాస్ట్ ఫుడ్, స్నాక్స్, కృత్రిమ రంగులు, వాటిలో ఉపయోగించే రసాయన రుచులు పక్షుల ప్రాణాలకు హాని కలిగిస్తాయి.



## ప్రపంచంలోనే అత్యంత స్వచ్ఛమైన గాలి ఏ ప్రాంతంలో ఉందో కనిపెట్టిన శాస్త్రవేత్తలు, అక్కడ కాలుష్యం జాడే కనిపించదు

గాలి కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న రోజులివి. కొన్నిచోట్ల స్వచ్ఛమైన గాలిని కాసేపు ఆక్సిజన్ సిలిండర్ల ద్వారా పీల్చుకోవాల్సిన పరిస్థితి కూడా ఉంది. అందుకే శాస్త్రవేత్తలు ఈ ప్రపంచంలో ఎక్కడ స్వచ్ఛమైన గాలి ఉందో తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఆస్ట్రేలియాలోని టాస్మానియాలో కెనుక్ అనే చోట ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన గాలి ఉందని కనుగొన్నారు. ఇక్కడ గాలి చాలా స్వచ్ఛంగా ఉంటుంది. అందుకే శాస్త్రవేత్తలు తమ వాతావరణ అధ్యయనాలకు ఇదే ప్రదేశాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. ఈ ప్రదేశం ప్రపంచంలోనే మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే ఎందుకు భిన్నంగా ఉంటుందో, అత్యంత పరిశుభ్రమైన గాలిని ఎందుకు కలిగి ఉందో తెలుసుకుందాం.

### ఆస్ట్రేలియాలో...

టాస్మానియాలోని కెనుక్ ప్రాంతంలోని గాలి పరిశుభ్రంగా ఉంటుంది. దీన్నే కేప్ గ్రిమ్ అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ఇక్కడికి చేరే గాలులు నైరుతి దిశలో ప్రయాణిస్తూ వస్తాయి. ఈ గాలులు దక్షిణ మహాసముద్రం మీదుగా వేల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. ఆ వైపుగా పారిశ్రామిక కార్యకలాపాలు ఏవి జరగడం లేదు కాబట్టే అటు నుంచి నేరుగా ఈ కెనుక్ ప్రాంతానికి వచ్చే గాలిలో ఎలాంటి కలుషితాలు ఉండవు. కాలుష్యాలు కనపడదు. అందుకే అక్కడ ఉన్న ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారు.

### వాయు కాలుష్య కేంద్రం

ఈ కెనుక్ ప్రాంతంలోని గాలి గురించి ముందే శాస్త్రవేత్తలకు తెలుసు. అందుకే ఇక్కడ వాయు కాలుష్య కేంద్రాన్ని 1976లోనే స్థాపించారు. ఈ స్టేషన్ ఆస్ట్రేలియన్ బ్యూరో ఆఫ్ మెటీరియాలజీ, కామన్వెల్త్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్లు కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఈ కాలుష్య కేంద్రం ప్రధాన పని గ్రీన్ హౌస్ వాయువులు, ఏరోసోల్స్, ఇతర వ్యర్థాలతో కలిగిన వాతావరణాన్ని విశ్లేషించేందుకు ఏర్పాటు చేసింది. ఈ ప్రదేశం ప్రకృతి ప్రేమికులకు స్వర్గంలా ఉంటుంది. పర్యాటకులకు ఆకర్షణీయ కేంద్రంగా మారింది. ఇక్కడున్న పర్యావరణ వ్యవస్థ ప్రకృతికి జీవాన్ని అందించింది. ఇది తీరప్రాంతాన్ని కలిగి ఉంటుంది.

అడవి సముద్రం కలిసే దృశ్యాలు ఎంతో అందంగా ఉంటాయి. సహజ సౌందర్యానికి ఇది ఎంతో ప్రసిద్ధి చెందింది. స్వచ్ఛమైన గాలిని పీల్చాలనుకుంటే ఈ కెనుక్ ప్రాంతానికి వెళ్లి చూడండి. అయితే వాయు కాలుష్య కేంద్రంలోకి అందరికీ ప్రవేశం ఉండదు. కానీ చుట్టుపక్కల ప్రాంతాల్లో మాత్రం పర్యాటకులు తిరగవచ్చు. అక్కడున్న సహజ సౌందర్యాన్ని ప్రకృతిని ఆస్వాదించవచ్చు. ఎప్పుడైనా ఆస్ట్రేలియా వెళితే కచ్చితంగా మీరు ఈ ప్రాంతాన్ని చూడాల్సిందే. ఈ కెనుక్ సమీపంలోనే టార్కిన్ అనే అడవి ఉంది.

ఇది సాహస ప్రియులకు ఎంతో నచ్చుతుంది. విభిన్న జంతుజాలాలు ఇక్కడ ఉంటాయి. ఈ ప్రాంతం చాలా ఉంటుంది. అక్కడి గాలులు మనకి తాజాదనాన్ని అందిస్తాయి. ఇవి పురాతనమైన అడుగులు ఈ ప్రాంతానికి వెళితే తిరిగి రావాలనిపించదు. శరీరంలో ఒక్కసారిగా కొత్త ఉత్తేజం చేరినట్టు అనిపిస్తుంది.

## చీమ ఒక వ్యక్తిత్వ వికాస గ్రంథంతో సమానం
## వాటి నుంచి మనిషి ఈ లక్షణాలన్నీ నేర్చుకోవాలి



చీమలు చాలా చిన్నగా ఉంటాయి. వాటిని చూసి మనం నేర్చుకునేదేంటి? అని ఎంతోమంది అనుకుంటారు. నిజానికి చీమను మించిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు మరొకరు లేరు. మనిషి జీవితంలో ఎదురయ్యే ప్రతి ప్రశ్నకు చీమ నుంచి మనం పరిష్కారాన్ని నేర్చుకోవచ్చు. టీం వర్క్ గా, ఒంటరిగా, నాయకుడిగా ఎలా జీవించాలో చీమలు తమ నడవడికతోనే నేర్పిస్తాయి.



### ఒకే లక్ష్యంతో ముందుకు

చీమలన్నీ కలిసి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానికోసమే ప్రయాణం సాగిస్తాయి. వాటి లక్ష్యం ఆహారాన్ని సేకరించడం. అవి తమ కోసం తాము సేకరించుకోవు. మొత్తం తమ బృందం కోసం సేకరిస్తాయి. ఆ ప్రయాణంలో ఒక్క చీమ కూడా సమయాన్ని వృధా చేయదు. ఒకదాని వెంట ఒకటి ఆగకుండా ప్రయాణిస్తూనే ఉంటాయి. చలికాలంలో పుట్ట నుంచి బయటికి వచ్చి ఆహారాన్ని వెతకలేవు. కాబట్టి వేసవికాలంలోనే చలికాలానికి కావలసిన ఆహారాన్ని కూడా సేకరించి పెట్టుకుంటాయి. అవన్నీ కూడా ఎవరి ఆహారాలు దాచుకోకుండా అంత ఆహారాన్ని ఒకే చోట దాచిపెడతాయి. అలాగే బృందంగానే తింటాయి .


### ఒకే మాట ఒకే బాట

చీమల నుంచి మనం నాయకత్వ లక్షణాలను కూడా నేర్చుకోవాలి. ఐకమత్యమే మహాబలం అన్నది చీమ చెప్పకనే చెబుతోంది. నాయకుడు చెప్పిన ఒకే ఒక్క మాటకి ఆ బృందమంతా కలిసే ఉంటుంది. అతడు పెట్టిన నియమ నిబంధనలతోనే పాటిస్తుంది. అన్ని ఒకేలాగా చీమల నాయకుడి మాటను వింటాయి. టైం మేనేజ్మెంట్ అంటే సమయపాలన పాటించడంలో చీమలను మించిన జీవి లేదు. వాటికి క్రమశిక్షణ చాలా ఎక్కువ. సొంత పనులను చేసుకోవు. అన్ని చీమలు బృందంగా కలిసి వెళ్లి కలిసి వస్తాయి. నాయకుడు చెప్పిన పనిని లక్ష్యాన్ని త్వరగా చేరుకునేందుకే అన్నీ కలిసి అడుగులు వేస్తాయి.

### బరువు బాధ్యతలు మోస్తూ

ఆహార అన్వేషణ అయినా, ఇంటి నిర్మాణం అయినా కూడా చీమలు కలిసికట్టుగానే పనిచేస్తాయి. ఒక పుట్ట నిర్మించేందుకు ఎన్నో చీమలు కష్టపడతాయి. ఆ పుట్టలో ఉన్న తన ప్రాంతంతోపాటు ఇతరుల ప్రాంతాలు కూడా పరిశుభ్రంగా, పటిష్టంగా ఉండేలా ప్రతి చీమా కష్టపడుతుంది. చీమకు సోమరితనం తెలియదు. శరీరాన్ని దాచుకోకుండా శక్తివంచన లేకుండా పనిచేస్తాయి. తమ కన్నా అనేక రెట్లు ఎక్కువ బరువున్న వస్తువులను మోస్తూ బాధ్యతలను నిర్వర్తిస్తాయి. చీమలకు అడ్డదిడ్డంగా నడవడం తెలియదు. ఒక పద్ధతిలోనే ఒకదాని వెనక ఒకటి క్యూ లైన్ లోనే వెళ్తాయి. అలాగే మనుషులకు అడ్డుగా కూడా జీవించేందుకు ఇష్టపడవు. ఇంట్లో గోడ వారనుంచి ప్రయాణాన్ని సాగిస్తాయి. ఇంట్లో ఏదో ఒక మూలే తమ నివాసాన్ని ఏర్పరచుకుంటాయి. ఇతరులకు ఆటంకం కలిగించడం, ఇతరుల జీవితాల్లో హానికరంగా మారడం కూడా చీమలు చేయవు. అంతేకాదు అవి వాతావరణాన్ని బట్టి తమ అలవాట్లను మార్చు కుంటాయి. జీవిత శైలిని కూడా మార్చుకుంటాయి.

ఈ ప్రకృతిలో ఎంతో క్రమ శిక్షణగా, బుద్ధిగా జీవించేవి చీమలే. చీమల కున్న గుణాలు మనుష లకు ఉంటే ఈ ప్ర పంచం ఒక అంద మైన ప్రదే శంగా మారి పోతుంది.





## సిగరెట్ మానలేకపోతున్నారా? ఇలా చేస్తే ధూమపానం చేయాలన్న ఆసక్తి పూర్తిగా పోతుంది



స్మోకింగ్‌కు బానిసలుగా మారుతున్నవారి సంఖ్య ప్రతి ఏటా పెరిగిపోతోంది. ధూమపానం వల్ల శారీరకంగా, మానసికంగా ఎన్నో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఈ అలవాటు ఊపిరితిత్తుల క్యాన్సర్ కు దారితీస్తుంది. దాని వల్ల కలిగే అనర్థాలు తెలిసినా కొందరు దాన్ని మానలేకపోతున్నారు. సిగరెట్లు మానేయడం లేదా తగ్గించడం అనేది కష్టమైన పనే కానీ అసాధ్యం మాత్రం కాదు. ప్రతి సంవత్సరం మార్చి రెండవ బుధవారం నో స్మోకింగ్ డే నిర్వహించుకుంటాం. ధూమపానం మానేయాలనుకునేవారికి సహాయపడటానికి ఈ రోజును ఆరోగ్య అవగాహన దినోత్సవంగా చేస్తారు. ధూమపానం మానేయడానికి మీకు సహాయపడే కొన్ని మార్గాలు ఇక్కడ ఉన్నాయి. మీరు ధూమపానం మానేయాలనుకుంటే, ఎందుకో మానేయాలనుకుంటున్నారో ముందుగా మనసులో గట్టిగా అనుకోండి. బలమైన కారణం ఉన్నప్పుడు, మిమ్మల్ని మీరు అదుపులో ఉంచుకునే అవకాశం ఉంటుంది.

కుటుంబంతో

ధూమపానం మానేయాలనుకుంటే ఒంటరిగా నివసించకండి. మీ కుటుంబం, స్నేహితులతో ఎక్కువసేపు మాట్లాడుతూ ఉండండి. వారి సహాయాన్ని అడగండి. మీ కుటు ంబం కూడా మీరు సిగరెట్లు వదిలే యడంలో ఎంతో సహాయపడతారు.

శారీరక శ్రమ వల్ల

శారీరక శ్రమ ఎక్కువగా చేస్తే ధూమ పానం చేయాలనే కోరిక చాలా వరకు తగ్గి పోతుంది. వ్యాయామం, ఆటలు, యోగా, చురుకైన నడక, లోతైన శ్వాస వ్యాయామాలు, డ్యాన్సు వంటి పనులు ధూమపానం పట్ల కోరికను చాలా వరకు తగ్గిస్తాయి.

హైడ్రేషన్ గా ఉండాలి

తగినంత మొత్తంలో నీరు శరీరంలో ఉంటే ధూమపానం మీద ఆసక్తి తగ్గిపోతుంది. నీరు శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతుంది. తగినంత నీరు త్రాగటం మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. మీకు పొట్ట నిండిన అనుభూతిని కలిగిస్తుంది. కాబట్టి మీకు ధూమపానం చేయాలన్న కోరిక కూడా తగ్గిపోతుంది. మీరు ధూమపానం మానేయాలనుకుంటే, క్వినోవా, బ్రౌన్ రైస్, వోట్స్ వంటి తృణధాన్యాలను ఆహారంలో అధికంగా తినండి. వీటిని తినడం వల్ల శక్తి పెరుగుతుంది. ఇది గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ధూమపానం మానేయడానికి ఇది సహాయపడుతుంది.

నట్స్‌జి

అల్పాహారం కోసం బాదం, పొద్దు తిరుగుడు విత్తనాలు, గుమ్మడికాయ విత్తనాలు వంటివి అధికంగా తినండి. వీటిలో విటమిన్ ఇ ఉంటుంది. ధూమపానం వల్ల ప్రభావితమైన చర్మ ఆరోగ్యాన్ని కూడా ఇవి మెరుగు పరుస్తుంది. సిగరెట్ తాగే కోరికను తగ్గించడానికి , మీరు చక్కెర లేని స్వీట్లు, సోంపు లేదా ముడి క్యారెట్లు, డ్రై ఫ్రూట్స్, పొద్దు తిరుగుడు విత్తనాలను తింటే మంచిది.

**(గమనిక: అధ్యయనాలు, హెల్త్ జర్నల్స్ నుంచి సేకరించిన సమాచారాన్ని మీ కోసం ఇక్కడ అందిస్తున్నాం. ఇది కేవలం సమాచారం మాత్రమే. ఇది వైద్యానికి లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. ఆరోగ్యానికి సంబంధించి సందేహాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించండి.)**